ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



7 రోజులు.. రూ.10 లక్షల జరిమానా

రాజమహేంద్రవరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిందేనని ఎస్పీ నరసింహ కిశోర్ స్పష్టం చేశారు. జిల్లాలో హెల్మెట్ వినియోగంపై ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టామన్నారు. ఈ నెల 18 నుంచి 24 వరకూ వారం రోజుల్లో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో చేపట్టిన తనిఖీల్లో 1016 కేసులు నమోదు చేసి రూ.10.16 లక్షలు ఈ-చలానాలు విధించామన్నారు. హెల్మెట్ వాహన చోదకులు అలవాటుగా చేసుకోవాలన్నారు.

వినాయక మండపాలకు ఉచిత విద్యుత్

- మంత్రి లోకేశ్ చొరవతో ప్రభుత్వ నిర్ణయం
- ఉమ్మడి జిల్లాలో ఉత్సవ కమిటీలకు ఊరట
- వచ్చేనెలలో విజయదశమికి ఏర్పాటు చేసే మండపాలకూ ఉచిత విద్యుత్ సౌకర్యం

పిఠాపురం,ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే మండపాలు, పందిర్లకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఉత్సవాలు జరిగే అన్నిరోజుల్లో ఉచిత విద్యుత్ అందజేయాలని వివిధ గణేష్ ఉత్సవ సమితులు, మండపాల నిర్వాహకులు రాష్ట్ర ఐటీ,విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌లతో ఆయన చర్చించారు. దీంతో ఉచిత విద్యుత్ అందజేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని లోకేశ్ ట్విట్టర్(ఎక్స్), ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు. దసరా సందర్భంగా ఏర్పాటు చేసే మండపాలకు కూడా ఉచిత విద్యుత్‌ను అందించనున్నారు.

విద్యుత్ భారం నుంచి ఉపశమనం

వినాయక చవితి సందర్భంగా జరిగే నవరాత్రి ఉత్సవాలు జరిగే అన్ని రోజులకు విద్యుత్ సరఫరా నిమిత్తం నిర్వాహకులు తాత్కాలిక కరెంటు కనెక్షన్ తీసుకోవడం లేదా ఇతర కనెక్షన్లనుంచి సరఫరా తీసుకుని సొమ్ములు చెల్లించేవారు. ఇప్పుడు ఆ బాధ తప్పింది. దీనివల్ల కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల పరిధిలో 7,500 పెద్ద, మధ్య తరహా వినాయక మండపాలు, మరో 10వేల వరకూ చిన్నతరహా మండపాలు, పందిర్ల నిర్వాహకులకు ఉపశమనం కలగనుంది. ఈ మండపాలన్నింటికీ ఉచిత విద్యుత్ ఎలా అందించాలనే విషయమై రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేస్తుందని ఏపీఈపీడీసీఎల్ అధికారులు తెలిపారు. దానికి అనుగుణంగా కరెంటు కనెక్షన్లు ఇస్తామని ఆయన చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.25కోట్లు, ఉమ్మడి జిల్లాకు సంబంధించి రూ.4కోట్ల వరకూ ఉచిత విద్యుత్‌కు అయ్యే వ్యయాన్ని ప్రభుత్వం భరించనుంది. మండపాలకు ఉచిత విద్యుత్ అందించేలా చొరవ తీసుకున్న మంత్రి నారా లోకేశ్‌కు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

డీఎస్సీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు
విస్తృత ఏర్పాట్లు
- 28న గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో పరిశీలన ప్రక్రియ
6

7
డ్రగ్స్ కేసులో రెవెన్యూ అధికారి పేరుపై కలకలం

ఓపిక.. నశిస్తోంది!





పాపం పెద్ద పరీక్షే : గోకవరం ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం రక్త పరీక్షలకు రోగుల క్యూ

ప్రభుత్వ ఆసుపత్రికెళితే.. రోగులకు తప్పని అవస్థ

- ఓపీ కోసమే గంటల తరబడి క్యూ
- ఆ తరువాత వైద్యుడి వద్దా ఇంతే
- అభయా యాప్‌లో నమోదైతేనే చీటీ
- ల్యాబ్ పరీక్షలంటే రోజు తప్పదు
- ఇబ్బందులు పడుతున్న రోగులు
- నీరసించి పడిపోతున్న జనం
- పట్టించుకోని ఉన్నతాధికారులు

రోగం తగ్గించుకుందామని ప్రభుత్వాసుపత్రికి వెళుతుంటే ఓపీ చీటి చేతికందేలోపునే కొత్త రోగం వచ్చేలా ఉంది పరిస్థితి.. ఈ సంఘటనే అందుకు ఉదాహరణ.. గోకవరం మండలంలోని గుమ్మళ్ళదొడ్డి గ్రామానికి చెందిన సూరంపూడి నాగు అనారోగ్యానికి గురవ్వడంతో సోమవారం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చాడు.. రెండు గంటల పాటు నిలబడి ఓపీ చీటీ రాయించుకున్నాడు.. వైద్యుడి గది వద్దకు వెళ్లి కొంతసేపు నిలబడే సరికి అనారోగ్యంగా ఉండడంతో బాగా నీరసించి స్పృహతప్పి పడిపోయాడు. వెంటనే అతని బంధువులు, ప్రక్కనే ఉన్న రోగులు కలిసి వైద్యుడి వద్దకు తీసుకెళ్లగా వెంటనే సెలైన్ ఎక్కించారు.. ప్రతి రోజూ ఇటువంటి కేసులు నమోదవుతూనే ఉన్నాయి.. ప్రభుత్వాసుపత్రికి వెళుతుంటే వైద్యుడిని కలవడానికే గంటల సమయం పట్టడంతో రోగుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు..

గోకవరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద ఓపీ చీటీ పొందాలంటే గంటల తరబడి నిరీక్షించాల్సిందే.. మీ ఒంట్లో ఉన్న రోగానికంటే మరెక్కువ సహనం ఉండి తీరాల్సిందే.. అపుడు కూడా మీ దగ్గర ఫోన్ ఉంటేనే. ఒక వేళ ఫోన్ లేకపోయినా.. నిలబడే ఓపిక నశించినా ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగెత్తాల్సిందే.ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపీ చీటీకి ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆన్ లైన్ విధానం..సాయంత్రం 4 గంటల నుంచి ఆఫ్ లైన్ విధానం కొనసాగుతోంది.ఇదీ నిత్యం జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల వద్ద రోగుల అవస్థలు.

వందలాది మంది రోగులు.. ఒక్కరే ల్యాబ్ టెక్నీషియన్

గోకవరం ప్రభుత్వాసుపత్రి అటు ఏజెన్సీకి అనుసంధానంగా ఉంటుంది. దీంతో ప్రతిరోజు ఓపీ వందల్లోనే ఉంటుంది. అటువంటి ఆసుపత్రిలో ఒకే ఒక్క ల్యాబ్ టెక్నీషియన్ డిప్యుటేషన్‌పై విధులు నిర్వర్తించడం విస్మయానికి గురిచేస్తుంది. ఓపీని తట్టుకోలేక ఇక్కడ పనిచేసే టెక్నీషియన్లు బదిలీపై వెళ్లిపోతున్నారు. దీంతో ప్రస్తుతం అనపర్తి, కడియం ఆసుపత్రుల నుంచి ల్యాబ్ టెక్నీషియన్లు వచ్చి విధులు నిర్వర్తిస్తున్నారు. అసలే ఓపీ ఆలస్యం అవుతుందంటే మరో వైపు రక్త పరీక్షల రిపోర్టులు సమయానికి అందక రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. ల్యాబ్ టెక్నీషియన్లను పెంచాలని కోరుతున్నారు.



జిల్లా ఆసుపత్రిలోనూ ఇంతేగా..

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి (జీజీహెచ్) సోమవారం రోగులతో కిటకిటలాడింది. ఓపీ విభాగంలో నెట్‌వర్క్ సమస్య, సర్వర్ డౌన్‌తో పాటు సిబ్బంది వేగంగా రిజిస్ట్రేషన్లు చేయకపోవడం తదితర కారణాలతో రోగులు, వారి బంధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రిజిస్ట్రేషన్ల కోసం, ఓపీ చీటీ కోసం, టెస్టుల కోసం, మాత్రల కోసం రోగులు, వారి సహాయకులు గంటల కొద్దీ నానా యాతనా పడాల్సి వస్తోంది. సాధారణ జలుబు, జ్వరం వంటి చిన్న రోగంతో జీజీహెచ్‌కు వచ్చినా ఒక పూట గడిచిపోతోంది.దీంతో ఆసుపత్రికొచ్చే రోగులు, వారి కుటుంబీకులు అసంతృప్తికి గురవుతున్నారు. అయినా ఓపీ విభాగం వద్ద సమస్యను అధికారులు పట్టించుకోవడంలేదు. జిల్లా ఉన్నతాధికారులు సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆసుపత్రికెళితే.. అ..భయమే!

గతంలో ఆసుపత్రికి వెళితే మామూలుగా లైన్‌లో నిలబడితే రోగులను బట్టి ఓపీ చీటు లభించేది. కానీ ఇపుడు ఓపీ విధానం మారిపోయింది. ఓపీ చీటు తీసుకునేందుకు రోగుల వివరాలను ఆసుపత్రి సిబ్బం ది అభ యాప్‌లో నమోదు చేస్తారు. అపుడు రోగి ఫోన్‌కు ఓటీపీ నెంబరు వస్తుంది. ఆ తరువాత సిబ్బంది టోకెన్ నెంబరు కేటాయిస్తారు.ఆ నెంబరు తీసుకుని మరో కౌంటర్‌కు వెళ్లాలి. అక్కడున్న సిబ్బందికి మనకున్న ఇబ్బందులు చెబితే ఏ వైద్యుడి వద్దకు వెళ్లాలో ఆ రూమ్ నెంబరును ఓపీ చీటీపై వేసిస్తారు. అప్పటికే ఓపీ చీటీ కోసం గంటల తరబడి నిలబడి ఉన్న రోగులకు ఓపిక అయిపోతుంది. మళ్లీ వైద్యుడి రూమ్ వద్దకు వెళ్లి ఓపిక పట్టాలి. వైద్యుడి దగ్గరికి వెళ్లాక ఆయన రక్త పరీక్షలు రాస్తే మరింత నరకం చూడాల్సిందే.ఆ పరీక్షల రిపోర్టు వచ్చిన తరువాత మరోమారు వైద్యుడిని సంప్రదించాక ఆయన చీటీపై రాసిన మందులను తీసుకొని ఇంటికెళ్లాలి. దీంతో రోగుల ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఉన్నతాధికారులు స్పందించి ఓపీ నమోదులో సవరణలు చేస్తే బాగుంటుందని రోగులు కోరుకుంటున్నారు.

ఉదయం 6.30 గంటలకు వచ్చా..



మా అబ్బాయికి జ్వరం రావడంతో ఉదయం 6.30 గంటలకు ఆసుపత్రికి వచ్చి వైద్యుడి సంప్రదించగా రక్త పరీక్షలు రాశారు. సమయం 11 గంటలు దాటినా ఇంకా పరీక్ష కేంద్రంలోకి వెళ్లలేక పోయా. **- మద్దా రమణ, అచ్చుతాపురం**

రక్త పరీక్షలు ఆలస్యం..



నా కుమార్తెకు జ్వరంగా ఉండడంతో ఉదయం 9 గంటలకు రక్తపరీక్షలు చేయిద్దామని.. సమయం 11 గంటలు దాటింది.నా ముందు సుమారు 25 మంది పైన రక్త పరీక్షలు కోసం వచ్చినవారున్నారు. **- సంకరమ్మ, ఆర్అండ్ఆర్ కాలనీ**

ఆసుపత్రికి వచ్చాక నొప్పి ఎక్కువైంది..



కాలు నొప్పి చూపించుకుందామని ఉదయం 8 గంటలకు వచ్చా. 11:30 గంటలు దాటినా పరీక్షలు పూర్తి కాలేదు. ఉన్న నొప్పి కంటే ఆసుపత్రికి వచ్చి తెచ్చుకున్న నొప్పి మరింత ఎక్కువైంది. **- కిల్లాడి వెంకటలక్ష్మి, వీరలంకపల్లి**

టీడీపీ జిల్లా అధ్యక్షుడెవరో!

నేడు మధురపూడిలో త్రిసభ్య కమిటీ సభ్యుల సమావేశం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

టీడీపీ జిల్లా అధ్యక్ష పదవికి పోటీ పెరిగింది.మాజీ మంత్రి కెఎస్ జవహర్‌కు ఎస్సీ కమిషన్ చైర్మన్ పదవి రావడంతో జిల్లా అధ్యక్ష పదవికి దూరమైన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి పార్టీ జిల్లా అధ్యక్ష పదవి ఖాళీగా ఉంది. గత మే నెలలో మహానాడు నాటికి కొత్త కమిటీల ఎన్నుకోవాల్సి ఉంది.కానీ ఇప్పటి వరకూ సంస్థాగత ఎన్నికలు నిర్వ హిస్తున్నారు. ప్రస్తుతం జిల్లా కమిటీతో పాటు, ఆయా నియోజకవర్గాల నుంచి రాష్ట్ర కమిటీ లోకి ఎవరిని తీసుకోవాలనేది నిర్ణయించ నున్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు త్రిసభ్య కమిటీ మంగళవారం జిల్లాకు రానుంది. త్రిసభ్య కమిటీ సభ్యులుగా మంత్రి కొలుసు పార్థసారథి,ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఉన్నారు. మధురపూడి విమానాశ్రయం సమీపంలోని రాజానగరం టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఉద యం 10 గంటలకు సమావేశం నిర్వహి స్తారు.ఈ సమావేశానికి జిల్లాలోని టీడీపీ ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి వాసు, మద్దిపాటి వెంకట్రాజు, ముప్పిడి వేంకటేశ్వర రావుతో పాటు రాజానగరం ఇన్‌చార్జి బీవీఆర్ చౌదరి,నిడదవోలు ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు,అనపర్తి నుంచి నల్లమిల్లి మనోజ్ రెడ్డితో పాటు ఆయా నియోజకవర్గాల పరిధిలోని ముఖ్యనేతలంతా హాజరు కానున్నారు. వీరి నుంచి త్రిసభ్య కమిటీ అభిప్రాయాలు సేకరించి జిల్లా కమిటీ, రాష్ట్ర కమిటీ సభ్యుల పేర్లను ప్రతిపాదించి, అధిష్ఠానానికి సమర్పిస్తుంది.అధిష్ఠానం పరిశీలించి త్వరలోనే అధికారికంగా ప్రకటించనుంది. కానీ ఇక్కడ ఇంకా ఏ వర్గానికి ఇవ్వాలనేదానిపై స్పష్టత లేదు. జిల్లాలోని అందరి అభిప్రాయాలు తీసు కున్న తర్వాత కమిటీ ప్రతిపాదించిన పేర్ల నుంచే అధిష్ఠానం జిల్లా అధ్యక్షుడిని, కమిటీని ప్రకటిస్తుంది. ప్రస్తుతం అనేక మంది జిల్లా, రాష్ట్ర కమిటీలో చోటుకు ఒత్తిడి తేవడం గమనార్హం.



మట్టి గణపతే.. మహా గణపతి

6

మట్టి గణపతే మహా గణపతి అంటున్నారు.. రంగు రంగుల విగ్రహాలను వదిలి మట్టి గణపతుల వైపు భక్తజనం చూస్తున్నారు.. దీంతో మట్టి విగ్రహాలకు డిమాండ్ పెరిగింది.. పందిళ్లలోకి ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ భారీ విగ్రహాలను వినియోగిస్తుండగా.. ఇళ్లల్లో పూజ చేసుకునే భక్తులు మాత్రం మట్టి విగ్రహాలకే జై కొడుతున్నారు.. బుధవారం వినాయక చవితి సందర్భంగా మార్కెట్‌లో ఎక్కడ చూసినా బుల్లి బుల్లి మట్టి విగ్రహాలే దర్శనమిస్తున్నాయి..



నిడదవోలులో స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న మంత్రి దుర్గేష్

స్మార్ట్ రేషన్ కార్డులతో అక్రమాలకు చెక్

మంత్రి దుర్గేష్

నిడదవోలు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : రేషన్ సరుకుల పంపిణీలో అక్రమాలకు చెక్ పెడుతూ.. రేషన్ వ్యవస్థను ప్రక్షాళన చేసేలా లబ్ధిదారులకు స్మార్టు రేషన్ కార్డుల పంపిణీకి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాలులో సోమవారం జిల్లాస్థాయిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏటీఎం, ఆధార్ కార్డు తర హాలో స్మార్టు రేషన్ కార్డును అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిందన్నారు. దీనిలో క్యూఆర్ కోడ్ పొందుపర్చామన్నారు. కార్డుపై ముద్రించిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే కుటుంబీకుల వివరాలు, ఈకేవైసీ, రేషన్ సరుకులు, డిపో వివరాలు తెలుస్తాయన్నారు.జేసీ ఎస్.చినరాముడు మాట్లాడుతూ కొత్త టెక్నాలజీతో రూపొందించిన స్మార్టు రేషన్ కార్డులు లబ్ధిదారుడి ఫొటోతో రూపొందించామన్నారు. కార్యక్రమంలో కొవ్వూరు ఆర్డీవో రాణీ సుస్మిత, జిల్లా పౌరసరఫరాల అధికారి వి.పార్వతి, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ ఎ.దుర్గేష్, మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, తహశీల్దార్ నాగరాజు నాయక్ పాల్గొన్నారు.

ఎరువులు అక్రమంగా నిల్వచేస్తే కఠిన చర్యలు

కలెక్టర్ ప్రశాంతి హెచ్చరిక

కోరుకొండ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ మండలం గాడాల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (ప్యాక్ సొసైటీ) కార్యాలయాన్ని కలెక్టర్ పి.ప్రశాంతి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల సరఫరాలో పారదర్శకత పాటించాలని ఆదేశించారు. తనిఖీ సమయంలో ఎరువుల పంపిణీ జాబితాను పరిశీలించిన కలెక్టర్ రెండు బస్తాలు ఇచ్చే చోట ఒక రైతుకి ఐదు బస్తాలు ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. కొంత మంది రైతులు అదనంగా కోరుతున్నారని చెప్పగా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎరువుల కేటాయింపు పట్టాదారు పాసు పుస్తకం ఆధారంగా విస్తీర్ణం అనుసరించి జరగాలన్నారు. ఎక్కువ మోతాదులో తీసుకున్న రైతులను గ్రామ రెవెన్యూ అధికారుల ద్వారా పిలిపించండి అని ఆదేశించారు. సక్రమంగా పనులు చేయలేకపోతే చర్యలు తప్పవని సిబ్బందికి స్పష్టం చేశారు. అనంతరం కోరుకొండ గ్రామంలోని గ్రోమోర్ స్టోర్, గొడౌన్, శ్రీ పద్మజ ఫెర్టిలైజర్ జనరల్ స్టోర్స్‌ను పరిశీలించారు. సీతానగరం మండలం వెదుళ్లపల్లి ప్యాక్ సొసైటీ రికార్డులు, స్టాక్ రిజిస్టర్లు పరిశీలించి సరఫరా, వినియోగం వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎరువులు, యూరియా ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం మాత్రమే పంపిణీ జరగాలన్నారు. ఒక్కో రైతుకు కేటాయించిన పరిమితిని మించకూడదన్నారు. ఎరువుల సరఫరా, వినియోగం పై రికార్డులు తనిఖీ చేసి తహశీల్దార్ సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అక్రమ రవాణా, నిల్వలపై ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయన్నారు. విధుల్లో నిర్లక్ష్యం, స్టాక్ వివరాలు సరిగా నమోదు చేయని సిబ్బందికి షోకాజ్ నోటీ సులు జారీ చేసి, నిర్దిష్ట గడువులోగా వివరణ కోరాలని అధికారులను ఆదేశించారు. ఆమె వెంట జిల్లా సహకార అధికారి ఎం.వెంకట రమణ, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు తదితరులు ఉన్నారు.



ఒక రైతుకు అధికంగా ఎరువులు ఇవ్వడంపై అధికారిని హెచ్చరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ఎరువుల డీలర్లతో కలెక్టర్ సమావేశం..

రాజమహేంద్రవరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) : యూరియా, కాంప్లెక్స్ ఎరువుల సరఫరాలో దుర్వినియోగం లేకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నాం. అవసరానికి మించి ఎవరూ నిల్వ చేసి ఉపేక్షించేది లేదు.రిటైల్ డీలర్లు మార్గదర్శకాలు పాటించాలని కలెక్టర్ పి. ప్రశాంతి హెచ్చరించారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లాలోని ఎరువుల డీలర్లతో సమావేశం నిర్వహించారు.రాబోయే రబీ సీజన్‌కు అవసరమైన యూరియా, కాంప్లెక్స్ ఎరువులను ప్రభుత్వం సరఫరా చేసిందన్నారు. డీలర్లు అధిక మొత్తంలో కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయన్నారు.యూరియా ఒక బస్తాకు ప్రభు త్వం రూ.266గా ధర నిర్ణయించి సబ్సిడీతో ఇస్తుందని.. కానీ వాస్తవ ధర రూ.2300గా ఉందన్నారు. అవసరానికి మించి ఎరువులు కొనుగోలు చేసినా, నిల్వ చేసినారైతులను ప్రభావితం చేసేలా బల వంతపు అమకాలు చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్ఎస్‌కే ద్వారా వివరాలు అందజేసిన రైతులకే అమ్మకాలు జరపాల న్నారు.



పీజీఆర్ఎస్‌లో అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో సీతారామమూర్తి

పీజీఆర్ఎస్‌లో 181 అర్జీలు స్వీకరణ

రాజమహేంద్రవరం/రూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి):ప్రజా సమస్యలు వేగంగా పరిష్కరించాలని జేసీ ఎస్.చినరాముడు సూచించారు. బొమ్మూరు కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 181 అర్జీలు స్వీకరించినట్టు తెలిపారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో మాత్రమే కాకుండా క్షేత్రస్థాయిలో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అర్జీదారులు మండల , పంచాయతీ కార్యాలయాల్లో అధికారులకు అర్జీలు అందజేయవచ్చన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ నరసింహ కిశోర్ మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. 28 అర్జీలను స్వీకరించిన ఎస్పీ.. చట్ట పరిధిలో వాటి పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.





కలెక్టరేట్ ఎదుట విద్యార్థుల ధర్నా.. పోలీసులతో వాగ్వాదం

కలెక్టరేట్ వద్ద ఎస్ఎఫ్ఐ ధర్నా

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన విద్యార్థుల కలెక్టరేట్ ముట్టడి స్వల్ప ఉద్రిక్తతలకు దారితీసింది. కలెక్టరేట్ ప్రధాన గేటు ఎదురుగా ధర్నా చేసేందుకు ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. గేటుకు ఒక వైపున ధర్నా చేసుకోవాలని సూచించారు. కానీ ఎస్ఎఫ్ఐ నాయకులు ససేమిరా అంటూ గేటు ఎదుట బైఠాయించేందుకు ప్రయత్నించడంతో పోలీసులకు, ఎస్ఎఫ్ఐ నాయకులకు మధ్య వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది. దీంతో కొద్దిసేపు అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న డీఆర్వో ఆందోళన చేస్తున్న వారి వద్దకు వచ్చి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు తమ సమస్యలు పరిష్కరించాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ్మోహన్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.భాస్కర్, ఎన్.రాజా, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు, రాజమహేంద్రవరం నగర నాయకులు పాల్గొన్నారు.



మహా గణపతిం!



రేపటి నుంచి గణపతి నవరాత్రులు



21 పత్రాలు ఆరోగ్యమే

గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విఘ్నేశ్వరుడిని 21 రకాల పత్రాలతో పూజిస్తారు. అవన్నీ ఆరోగ్య ప్రదాయమే. ప్రధానంగా మాచీపత్రం, బృహతీపత్రం, బిల్వపత్రం, దూర్వాయియుగ్మం(గరిక), దత్తూర పత్రం, బదరీపత్రం, అపామార్గపత్రం, తులసీ, చూతపత్రం (మామిడి), కరవీరపత్రం, విష్ణుక్రాంత పత్రం, దాడిమి పత్రం, దేవదారుపత్రం, మరువకపత్రం, సిందువారపత్రం, జాజిపత్రం, గండకీపత్రం, శమీపత్రం, అశ్వత్థ పత్రం, అర్జునపత్రం, అర్కపత్రం(జిల్లేడు) ఉన్నాయని డాక్టర్ ఇఆర్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. అందుబాటులో ఉండే ఈ పత్రాలు అన్నీ మానవ జాతికే కాదు సమస్త జీవరాశులకు ఎంతో మేలు చేకూరుస్తాయి. నవరాత్రుల అనంతరం ఆ పత్రాలను పంటకాల్వల్లో, నదుల్లో విడిచిపెట్టడం వల్ల ఆయా ప్రాంతాల్లోని చెడును దూరంచేసి శుద్ధమైన నీటిగా మార్చే శక్తి ఆ పత్రాలకు ఉన్నాయని తెలిపారు.

ఉత్సవ అనుమతులకు ఇలా చేయండి

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

వినాయక చవితి ఉత్సవాల మండపాల ఏర్పాటు, ఊరేగింపుల నిర్వహణకు తప్పనిసరిగా ముందస్తు అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ అనుమతులకు రాష్ట్ర ప్రభుత్వం సింగిల్ విండో విధానాన్ని అమల్లోకి తెచ్చింది. గణేష్ ఉత్సవాలు నిర్వహించే వ్యక్తులు ముందుగా కమిటీగా ఏర్పడి సింగిల్‌విండో విధానంలో అనుమతులు తీసుకోవాలి. ముందుగా ప్రభుత్వం ప్రకటించిన https://ganeshutsav.ne వెబ్‌సైట్‌కు వెళ్లి న్యూ అప్లికేషన్‌పై క్లిక్ చేయాలి. మొబైల్ నెంబర్ ఎంటర్ చేసిన తర్వాత ఓటీపీ వచ్చి నెంబర్ వెరిఫికేషన్ జరుగుతుంది.ఆ తర్వాతే దరఖాస్తు విండో ఓపెన్ అవుతుంది.దీనిలో దరఖాస్తుదారుడి పేరు, మొబైల్ నెంబర్, ఈ మెయిల్, చిరునామా, కమిటీ పేరు, గణేష్ మండపం స్థలం, విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు, ఏ పోలీస్ స్టేషన్ పరిధికి వస్తుంది, సబ్‌డివిజన్, ఉత్సవ కమిటీ సభ్యుల పేర్లు, ఫోన్ నెంబర్లు, గణేష్ నిమజ్జనం తేదీ, సమయం, విగ్రహం తరలించే వాహనం వివరాలు వీటిని ఎంటర్ చేసిన తర్వాత దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుంది. ఇది జరిగిన తర్వాత సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులు, సిబ్బంది వచ్చి విగ్రహం ఏర్పాటు చేసే ప్రాంతాన్ని పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తారు. అనంతరం కమిటీ సభ్యులు https://ganeshutsav.net/application Status పై క్లిక్‌చేసి నో అబ్జక్షన్ సర్టిఫికెట్(ఎన్‌వోసీ), పాటించాల్సిన నిబంధనలతో కూడిన క్యూఆర్ కోడ్ డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. డౌన్‌లోడ్ చేసిన ఎన్‌వోసీ, క్యూఆర్ కోడ్ లామినేట్ చేయించి మండపంలో ఉంచాలి. అధికారులు తనిఖీ చేస్తారు. మండపాల వద్ద రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకూ లౌడ్‌స్పీకర్లు వినియోగించరాదు. రోడ్డుపై పందిళ్లు వేయడం, ఫ్లెక్సీలు, బ్యానర్లు కట్టడం చేయకూడదని పోలీసులు స్పష్టం చేస్తున్నారు.అనుమతులకు ఒక పైసా చెల్లించనవసరం లేదు. ఉచితంగానే మంజూరు చేస్తారు.



రెడీగా.. గణేశుడు..

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి):జిల్లాలో వినాయక చవితి ఉత్సవ కమిటీలు సిద్ధమయ్యాయి. ఎక్కడికి అక్కడ చలువ పందేళ్లు ఏర్పాటు చేశారు. భారీ విగ్రహాలు ముస్తాబు చేస్తున్నారు. చవితికి కేవలం రెండు రోజుల వ్యవధి ఉండడంతో విగ్రహాలను పందిళ్లకు తరలిస్తున్నారు. విగ్రహ సైజులను బట్టి రూ.3,500 నుంచి రూ.30 వేలు వరకు ధరలు ఉన్నాయి. మార్కెట్లోని దుకాణాల్లో అయితే బుల్లి బొజ్జ గణపతి విగ్రహాలు రూ.50 నుంచి రూ.3 వేలు వరకు విక్రయిస్తున్నారు. మూడు అడుగుల ఎత్తు నుంచి 11 అడుగుల ఎత్తు గల విగ్రహాలు మార్కెట్‌లో ఉన్నాయి. మూడు నెలల ముందు నుంచి విగ్రహాలను తయారు చేయడం గమనార్హం. ప్రతి ఏడాది లక్షల్లో వ్యాపారం జరుగుతోంది. ఎందుకంటే వీధివీధినా గణపతులను ఏర్పాటు చేస్తారు. కొన్నిచోట్ల పందిళ్లను భారీ సెట్టింగ్‌లతో అదరగొట్టేస్తున్నారు. రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం, కొవ్వూరు, నిడదవోలు తదితర పట్టణాల్లో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. భారీ విగ్రహాలు ఏర్పాటు చేయనున్నారు.





జాగ్రత్తలు నిబంధనలు..

- వినాయక విగ్రహాల ఏర్పాటుకు సంబంధించి కమిటీని ఏర్పాటు చేసుకోవాలి. విగ్రహాలు ఏర్పాటు చేసే సంబంధిత స్థల యజమాని, మునిసిపాలిటీ, కార్పొరేషన్లు, పంచాయితీ అధికారుల అనుమతులు తప్పనిసరి.
- అగ్నిమాపక, విద్యుత్ శాఖ అధికారుల అనుమతులు తీసుకోవాలి.నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు చేయాలి.
- పందిళ్ల వద్ద అధిక వినిపించే సౌండ్ వినిపించే సౌండ్ బాక్సులు ఏర్పాటు చేయకూడదు. విద్యాసంస్థల, ఆసుపత్రులు, దేవాలయాలు, మసీదులు, చర్చిలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద మైక్ ప్రచారం చేయకూడదు. అసభ్య ప్రదర్శనలు నిషేధం.
- రాత్రి వేళల్లో మండపాల వద్ద కాపలా ఉండాలి. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. నిమజ్జనం పోలీసులు కేటాయించిన సమయంలో, మార్గంలోనే చేయాలి. ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఊరే గించాలి. వేడుకలు ప్రశాంతంగా ముగిసేలా ఏర్పాట్లు చేసుకోవాలి.

పర్యావరణ హితేశా.. గణేశా!

అమలాపురం రూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణే పండుగల పరమార్థం. అందునా తొలి పూజ అందుకునే గణపతి నవరాత్రులు పర్యావరణ హితాన్ని బోధిస్తున్నాయి. శుద్ధ చవితి నుంచి ప్రారంభమయ్యే గణపతి నవరాత్రి ఉత్సవాలకు మట్టినే తన రూపంగా మార్చుకుని పర్యావరణ హితబోధ చేసేందుకు ప్రతి ఇంటికీ లంబోదరుడు తరలిరానున్నాడు. చేసే ప్రతిపూజా ప్రకృతిని కాపాడేలా ఉండాలి. జీవకోటి మనుగడకు ఎటువంటి అవరోధం లేకుండా ఉండాలి. కానీ కాలక్రమంలో వచ్చిన ఆధునిక మార్పులతో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, రసాయనాలతో గణపతి విగ్రహాలను తయారు చేయడం, వాటిని నదుల్లో, ప్రధాన పంటకాల్వల్లో నిమజ్జనం చేయడం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతుంది. ఎన్నో జీవరాశులకు ముప్పు వాటిల్లుతుంది. ఆలస్యంగానైనా యథార్థాన్ని గుర్తించారు. పూర్వపు మాదిరిగా మట్టి వినాయకుని ప్రతిమలను వినియోగిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు ఎందరో ముందుకు వచ్చారు. వారి కృషి ఫలించడంతో పాటు ఎక్కడికక్కడ వ్యాపార, స్వచ్ఛంద సంస్థలు విరివిగా మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమాలు చేపడుతున్నాయి. ప్రతి ఇంట తొలిపూజలు అందుకునే లంబోదరుడి ప్రతిరూపాన్ని ఇంటి ప్రాంగణంలోని పూలకుండీల్లో నిమజ్జనం చేయడం అలవాటు చేసుకున్నారు. వినాయకుని పూజకు వినియోగించే 21 రకాల పత్రులు కూడా జీవకోటికి ఎంతో మేలు చేకూర్చేవే. ఇలా ప్రకృతి పురుషునిగా గణపతి నిలుస్తున్నారు.

మట్టి గణపతిని ఇంటి ఆవరణలో నిమజ్జనం చేయండి



మట్టి విగ్రహంతోనే పూజ చేయాలి.. పూజముగిసిన అనంతరం ఆ మట్టి విగ్రహాన్ని పొలంలో కానీ.. ఇంటి ఆవరణలోనే నిమజ్జనం చేసుకోవాలి. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారుచేసే గణపతి విగ్రహాలు ప్రమాదకరం. ఆ విగ్రహాలను నవరాత్రుల అనంతరం నదుల్లో, కాల్వల్లో నిమజ్జనం చేయడం వల్ల ఎన్నో జీవజాతులు ఆ నీటిని తాగి అనారోగ్యం పాలవుతున్నాయి.

-డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మ, కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు

మొక్క రూపంలో నిత్యం దర్శించుకుందాం



మట్టి వినాయక ప్రతిమల వెనుకభాగంలో ఏర్పాటు చేసిన రంధ్రంలో నచ్చిన మొక్కకు సంబంధించిన విత్తనాలను వేసి కుండీలో నిమజ్జనం చేయాలి. వేసిన విత్తు మొక్కగా మారి పూలు, పండ్లతో పాటు ఆరోగ్యవంతమైన గాలిని అందిస్తుంది. అంతటా విస్తరించి ఉన్న పరమాత్ముడు మొక్క రూపంలో నిత్యం దర్శనం ఇస్తూనే ఉంటాడు కదా.

-బళ్ల దివ్యతేజస్వి, భట్లపాలెం, బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల

డీఎస్సీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు విస్తృత ఏర్పాట్లు

- 28న పరిశీలన ప్రక్రియ
- 25 బృందాలు ఏర్పాటు
- డీఎస్సీ మెరిట్ అభ్యర్థులకు సమాచారం
- పరిశీలకుడిగా విద్యా శాఖ అడిషనల్ డైరెక్టర్ రామలింగం



చేబ్రోలులో డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం చేసిన ఏర్పాట్లను పరిశీలిస్తున్న విద్యా శాఖ అడిషనల్ డైరెక్టర్ రామలింగం, ఆర్జేడీ నాగమణి, కాకినాడ డీఈవో రమేష్

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025 మెరిట్ లిస్ట్ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు సంబంధించి అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఈ నెల 28వ తేదీన జరగనున్న ఈ ప్రక్రియకు సంబంధించి ఇప్పటికే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయగా వారికి కావాల్సిన ల్యాప్‌టాప్‌లు, ఇతర సౌకర్యాలను సమకూర్చారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి డీఎస్సీ-2025 మెరిట్ జాబితాలో ఉండి సమాచారం ఇచ్చిన వివిధ కేటగిరీలకు చెందిన 1241 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 28వ తేదీ ఉదయం 7 గంటల నుంచి జరగనున్నది. ఇందుకోసం కళాశాలలో 30 గదులను సిద్ధం చేశారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం ఎంఈవోలు, గెజిటెడ్ హెచ్‌ఎం, డిప్యూటీ తహసీల్దారు, ఎంఐఎస్ ఆపరేటర్‌లతో కూడిన 25 తనిఖీ బృందాలను ఏర్పాటు చేశారు. మరో ఐదు బృందాలను రిజర్వ్‌లో ఉంచారు. ప్రతి బృందం 50మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను తనిఖీ చేసి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాల్సి ఉంటుంది. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్లతో వారు తీసుకువచ్చే ఒరిజనల్ సర్టిఫికెట్లలో కుల ధ్రువీకరణ పత్రాలను డిప్యూటీ తహసీల్దారు, మిగిలిన విద్యార్హతల సర్టిఫికెట్లను ఇతర టీమ్‌సభ్యులుపరిశీలిస్తారు.

ఈ ప్రక్రియ సజావుగా సాగేందుకు ఉమ్మడి జిల్లాకు పరిశీలకుడిగా విద్యా శాఖ అడిషనల్ డైరెక్టర్ మువ్వా రామలింగాన్ని నియమించారు. ఆయనతో పాటు ఆర్జేడీ, ఉమ్మడి జిల్లా డీఈవోలు, డీవైఈవోలు, పరీక్షల ఏడీలు ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు.

కళాశాలలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం చేసిన ఏర్పాట్లను విద్యా శాఖ అడిషనల్ డైరెక్టర్ మువ్వా రామలింగం, ఆర్జేడీ నాగమణి, జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ సోమవారం పరిశీలించారు. అక్కడ సిద్ధం చేసిన 30 రూమ్‌లు, ఏర్పాటుచేసిన ల్యాప్‌టాప్‌లు, వైఫై, ఇతర సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా చూడాలని ఏపీఈపీడీసీఎల్ ఈఈని, బందోబస్తు నిమిత్తం గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణకు సూచనలు ఇచ్చారు. వారి వెంట గొల్లప్రోలు ఎంఈవో-2 శివప్రసాద్, మల్లాం జడ్పీ హైస్కూలు హెచ్‌ఎం గాజుల మురళీకృష్ణ వున్నారు.

మరోమారు...

డీఎస్సీ మెరిట్ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చివరి క్షణంలో మరోమారు వాయిదా పడింది. తొలుత 25వ తేదీన నిర్వహిస్తామని ప్రకటించినా ఆదివారం రాత్రి ఈ ప్రక్రియను 26, 27 తేదీలకు వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయగా, వినాయకచవితిని దృష్టిలో ఉంచుకుని మళ్లీ వాయిదా వేయాలని రాష్ట్రస్థాయిలో నిర్ణయం తీసుకున్నారు. 28వ తేదీ ఉదయం 7 గంటల నుంచే వెరిఫికేషన్ ప్రారంభిస్తామని, అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించాలని డీఈవో రమేష్ కోరారు.

ఎంపికైన కానిస్టేబుళ్లకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్



కాకినాడ క్రైం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కానిస్టేబుళ్లుగా ఎంపికైన అభ్యర్థులకు సోమవారం కాకినాడ పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించారు. ఎస్పీ జి.బిందుమాధవ్ ఈ ప్రక్రియను పర్యవేక్షించారు. ఎంపికైన ఏపీఎస్పీ (మెన్), సివిల్ (మెన్ అండ్ ఉమెన్) మొత్తం 649 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లు అన్నిటినీ పోలీసు అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, ఎస్‌బీ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, ఎస్పీ కార్యాలయ పరిపాలనాధికారి మూర్తి, టూటౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను పర్యవేక్షిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

తెలుగు భాషకు గుర్తింపు కోసం జాతీయ స్థాయిలో కృషి

రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు



తెలుగు భాషా సాహిత్య ఉత్సవాల ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఎంపీ సతీష్‌బాబు

కాకినాడ రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషకు గుర్తింపు కోసం జాతీయ స్థాయిలో కృషి చేస్తానని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు అన్నారు. కాకినాడ విద్యుత్ నగర్‌లోని ఐడియల్ డిగ్రీ కళాశాలలో వారం పాటు జరిగే డాక్టర్ పి.చిరంజీవినీకుమారి స్మారక తెలుగు భాషా సాహిత్య ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ సానా సతీష్‌బాబు డాక్టర్ పి.చిరంజీవినీకుమారి చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం తెలుగు భాషా ఉత్సవాలు, భాషా సాహిత్య పోటీలను జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ విద్యార్థుల్లో తెలుగు భాషా స్ఫూర్తి నింపేందుకు సాహిత్య సృజనలో ఆసక్తి పెంచేందుకు చిరంజీవినీకుమారి భాషా సాహిత్య ఉత్సవ వేదిక చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. విద్యాలయాల్లో తెలుగు భాషను సజీవంగా నిలిపేందుకు పార్లమెంట్ వేదికగా కృషి చేస్తానన్నారు.

గౌరవ అతిథి, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం మాట్లాడుతూ తెలుగు భాషా ఉత్సవాల నిర్వహణ అభినందనీయమన్నారు. ఎంపీ సానా సతీష్‌బాబును ఐడియల్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్, కార్యదర్శి పీఎస్ఎస్ కిరణ్, డాక్టర్ ఎన్ఎస్ మూర్తి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ మెర్ల రంజిత్ సత్కరించారు. కథానిక రచన పోటీల్లో సుమారు 50 పాఠశాలలు, 11 కళాశాలల నుంచి 320 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 40 మంది తెలుగు ఉపాధ్యాయులను అతిథులు సత్కరించారు. అవధాని జి.వేంకట సత్య నరసింహ శాస్త్రి తెలుగు ఉపాధ్యాయులనుద్దేశించి ప్రసంగించారు. 26, 28 తేదీల్లో పోటీలు జరుగుతాయని, గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా ఈ నెల 29న జరిపే తెలుగు భాషా దినోత్సవం సభలో విజేతలకు బహుమతులు అందజేస్తామని కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల పరిపాలనాధికారి వర్మ, కృష్ణంరాజు, శ్రీకాంత్, చింతపల్లి సుబ్బారావు, రచయితలు రవిమంత్రి, మాకినీడి, కేఎస్ వాసు, వైస్ ప్రిన్సిపాల్ వి.కామరాజు, పీఆర్వో బీఎస్ఆర్ కృష్ణ, శ్రీనివాస్, కవులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీపాదశ్రీవల్లభులకు లక్ష బిల్వార్చన

పిఠాపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో సోమవారం లక్ష బిల్వార్చన వైభవంగా జరిగింది. శ్రీపాదశ్రీవల్లభ జయంతి సప్తాహ మహోత్సవాల్లో ఐదో రోజు ప్రత్యేక పూజలు, శ్రీపాదుని దివ్య పాదుకలకు మహాన్యాసపూర్వక శత రుద్రాభిషేకం, గోపూజ, పల్లకీ సేవ జరిగాయి. రుత్విక్కులు, వేదపండితుల మంత్రోచ్ఛారణ మధ్య బిల్వార్చన సాగింది. అనంతరం శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహసరస్వతులను విశేషంగా అలంకరించారు. ఈవో సౌజన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.



లక్ష బిల్వార్చన నిర్వహిస్తున్న రుత్విక్కులు



లక్ష బిల్వార్చన అనంతరం శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతులకు ప్రత్యేక అలంకారం

● ఇద్దరు పురుషులు ఇష్టపడి.. ఒకరు హిజ్రాగా మారాలని మరొకరి షరతు
● ఆపరేషన్ కోసం దొంగతనానికి ప్లాన్
● వృద్ధురాలి కళ్లల్లో కారం కొట్టి బంగారు గొలుసు, గాజులతో పరారీ
● ఇద్దరిని అరెస్ట్ చేసిన తుని పోలీసులు

ఇన్‌స్టాగ్రామ్ పరిచయం.. పెళ్లి కోసం నేరం..


తునిలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీహరిరాజు

ఇన్‌స్టాగ్రామ్ పరిచయం కాస్తా ప్రేమగా మారింది. ప్రియుడితో పెళ్లి కోసం హిజ్రాగా మారాలనుకున్నాడో వ్యక్తి. అయితే ఆపరేషన్‌కు రూ.5 లక్షలు ఖర్చువుతుండడంతో దొంగతనానికి ప్లాన్ చేశాడు. పక్క ఇంటిని టార్గెట్ చేసుకున్నాడు. ఆ ఇంట్లో వృద్ధురాలిపై ప్రియుడితో కలిసి దాడి చేసి బంగారం లాక్కుని పరారై చివరికి పోలీసులకు చిక్కారు.

తునిరూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని పట్టణ పోలీస్‌స్టేషన్లో సోమవారం పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరిరాజు ఈ కేసు వివరాలను వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం యాదవోలు గ్రామానికి చెందిన సతీష్ అలియాస్ అవంతి కరెడ్డి 3 సంవత్సరాల క్రితం తుని వచ్చి స్థానిక హిజ్రాలతో కలిసి జీవిస్తున్నాడు. ఆడ లక్షణాలు ఉడడంతో రాత్రి వేళల్లో మహిళ వేషధారణలో జాతీయ రహదారిపై ఉంటూ పలువురిని ఆకరిస్తూ డబ్బులు సంపాదించేవాడు. అలాగే పండగలు, జాతరలో డ్యాన్సులు వేస్తూ జీవనపాధి పొందేవాడు. అవంతికరెడ్డికి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ప్రశాంత్ అనే యువకుడు పరిచయమయ్యాడు. దీంతో వారిద్దరూ తుని పదో వార్డులో నిమ్మకాయల వారి వీధిలో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని భార్యాభర్తల్లా కలిసి ఉంటున్నారు. ఈ క్రమంలో అవంతిక రెడ్డి తనను పెళ్లి చేసుకోమని ప్రశాంత్‌ను కోరగా ఆపరేషన్ చేయించుకుని పూర్తిగా హిజ్రాగా మారితే తాను పెళ్లి చేసుకుంటానని ప్రశాంత్ చెప్పాడు. దీంతో ఆపరేషన్‌కు అవసరమయ్యే రూ.5 లక్షల కోసం అవంతిక రెడ్డి, ప్రశాంత్ దొంగతనానికి ప్లాన్ వేశారు. వారి ఇంటి పక్కనే ఉన్న వృద్ధురాలు బాలేపల్లి సత్యవతిపై దాడి చేసి బంగారం చోరీ చేయాలని నిశ్చయించుకున్నారు. ఈనెల 20న అర్ధరాత్రి దాటిన తర్వాత సత్యవతి ఇంటి వెనుక భాగంలో బాత్రూం వద్దకు రాగా అప్పటికే వేచి ఉన్న అవంతికరెడ్డి, ప్రశాంత్ ఆమె కళ్లల్లో కారం కొట్టారు. చేతులతో నోటిని మూసి మెడలో ఉన్న పగడాల బంగారు గొలుసుతో పాటు చేతికి ఉన్న 4 బంగారు గాజులను లాక్కుని పరారయ్యారు. దీంతో సత్యవతి తుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. తుని సీఐ గీతా రామకృష్ణ ఆధ్వర్యంలో పలు కోణాల్లో దర్యాప్తు నిర్వహించిన పోలీసులు సత్యవతి ఇచ్చిన సమాచారం, ఇతర కోణాల్లో దర్యాప్తు ఆధారంగా దోపిడీ చేసింది అవంతికరెడ్డి, ప్రశాంత్ అని నిర్ధారించుకుని ఈనెల 24న కొండవారి పేటకు వెళ్లే దారిలో ఉన్న రైల్వే గెస్ట్ హౌస్ వద్ద వారిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 5 గ్రాముల పగడాల బంగారు గొలుసు, సుమారు నాలుగున్నర తూలల బంగారు గాజులు, 2 సెల్‌ఫోన్లు, స్కూటీ స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ రూ.7 లక్షలు ఉంటుందని డీఎస్పీ శ్రీహరిరాజు తెలిపారు. కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన తుని సీఐ గీతా రామకృష్ణ, ఎస్‌ఐలు విజయ్, పాపారావు, సిబ్బంది యాదవ్, నాయుడు, శివయ్యను కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్, డీఎస్పీ శ్రీహరిరాజు అభినందించారు.

7న సత్యదేవుడి ఆలయం మూసివేత

ఈవో సుబ్బారావు

అన్నవరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 7న చంద్రగ్రహణం సందర్భంగా అన్నవరంలో సత్యదేవుడి ఆలయం మూసివేయనున్నట్టు ఆలయ ఈవో సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తేదీ ఉదయం 10గంటల వరకు వ్రతం టిక్కెట్లు విక్రయించి మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సర్వదర్శనములు నిలుపుదల చేసి తలుపులు మూసివేయడం జరుగుతుందన్నారు. తిరిగి 8వతేదీన సంప్రోక్షణ చేసి ఉదయం 7 గంటల నుంచి సర్వదర్శనాలు వ్రతాలు ప్రారంభమవుతాయని భక్తులు గమనించాలని కోరారు. 7వ తేదీ చంద్రగ్రహణం రాత్రి 9.50కి ప్రారంభమై 1:31 వరకు ఉంటుందని దేవస్థానం పండితులు తెలిపారు.

ఇద్దరి మధ్య ఘర్షణ... విడదీసేందుకు వెళ్లిన వ్యక్తిపై చాకుతో దాడి

రాజానగరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు యువకులు గొడవ పడుతుండగా మధ్యలో విడదీసేందుకు వెళ్లిన వ్యక్తిపై చాకుతో దాడి చేసిన ఘటన ఆదివారం రాత్రి తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలో జరిగింది. గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక ముత్యాలమ్మ ఆలయం వద్ద గ్రామానికి చెందిన నీలం లక్ష్మీ ప్రసాద్ గణపతి మండపం డెకరేషన్ పనులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆలయం చెంతన గోళ్ల సాయి గణేష్, అగత్తి సాయి మధ్య ఘర్షణ ఏర్పడింది. గమనించిన లక్ష్మీ ప్రసాద్ ఇద్దరినీ విడదీసి సర్దిచెప్తున్న క్రమంలో గోళ్ల సాయి గణేష్ తన వెంట తెచ్చుకున్న చాకుతో గొంతు ఎడమ భాగంలో కోయడంతో రక్తపు గాయాలయ్యాయి. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ ప్రియకుమార్ కేసునమోదు చేశారు.

ఏటీఎంలో చోరీకి యత్నం...
ఇద్దరు అంతర్ జిల్లా దొంగల అరెస్ట్


నిడదవోలులో వివరాలు వెల్లడిస్తున్న సీఐ తిలక్

నిందితులపై 30 పాత కేసులు

సీఐ తిలక్

నిడదవోలు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఏటీఎంలో నగదు చోరీకి ప్రయత్నించిన అంతర్ జిల్లా దొంగలను అరెస్ట్ చేయడం ద్వారా 7 కేసులు ఛేదించినట్టు సీఐ పీవీజీ తిలక్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 14న నిడదవోలు మండలం తాడిమళ్ల గ్రామంలో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎంలో నగదు చోరీకి ప్రయత్నం జరిగింది. నిడదవోలుకు చెందిన కోలా అభిషేక్, కోనసీమ జిల్లాకు చెందిన గుద్దటి రాజు ఈ చోరీకి ప్రయత్నించగా వారిని అరెస్ట్ చేశారు. పెందుర్తిలో 2, పాడేరులో 1, వి. మాడుగలలో 1, మండపేట రూరల్‌లో 1, రాజా నగరంలో 1, సమిశ్రగూడెంలో 1 మొత్తం 7 నేరా లు ఈ ఇద్దరు కలిసి చేసినట్టు తమ దర్యాప్తులో వెల్లడైందని సీఐ తెలిపారు. నిందితులపై సుమారు 30 పాత కేసులు ఉన్నాయని, చిన్నతనం నుంచి చెడు వ్యసనాలకు లోనై దొంగతనాలు చేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐలు బాలాజీ సుందరరావు, జగన్ మోహనరావు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యంపై అక్టోబరు 7న జాతీయ సదస్సు


జాతీయ సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో నిర్వహణ

'నన్నయ' వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తెలుగుసాహిత్యం -భాషాబోధన మనోవికాసం అనే అంశంపై అక్టోబరు 7న పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలోని వై.ఎన్.కళాశాలలో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. వై.ఎన్.కళాశాల ప్రిన్సిపాల్, సదస్సు డైరెక్టర్ పిట్టా శాంతి సోమవారం తూర్పుగోదావరి జిల్లాలోని నన్నయ విశ్వవిద్యాలయానికి వచ్చి వీసీని కలిశారు. ఈ సందర్భంగా జాతీయ సదస్సు వివరాలు తెలిపారు. అనంతరం వీసీ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ప్రాచీన సాహిత్యం, ప్రబంధసాహిత్యం, దక్షిణాంధ్రయుగ సాహిత్యం, శతకసాహిత్యం, ఆధునిక సాహిత్య ప్రక్రియలు, జానపద గిరిజన విజ్ఞానం, ప్రాథమిక, ఉన్నత విద్య, మాతృభాషాబోధన, వివిధ బోధనా పద్ధతులు వంటి బోధన మనోవికాసం ఉప అంశాలపై పరిశోధకులు పరిశోధనాపత్రాలను వైఎన్‌బిఇడిసెమినార్2025 జి.మెయిల్ డాట్ కామ్ అనే మెయిల్‌కు సెప్టెంబరు25లోగా పంపించాలని కోరారు. తెలుగుభాష, సాహిత్య ఔన్నత్యాన్ని పెంపొందించే విధంగా జాతీయ సదస్సు నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో సదస్సు నిర్వాహకులు పి.శాంతి, ముత్యాలకళ్యాణ రామకృష్ణారావు, సీహెచ్.రుద్రమదేవి, జి.రాధ, సీహెచ్.వరలక్ష్మి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పీడీజే గంధం సునీత

13న జాతీయ లోక్ అదాలత్

ఎక్కువ సంఖ్యలో కేసుల పరిష్కారానికి కృషి : పీడీజే సునీత

రాజమహేంద్రవరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారం కావడానికి కృషి చేయాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత ఆదేశించారు. ఈ మేరకు సోమవారం తూర్పు గోదావరి, కాకినాడ, డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఎక్సైజ్ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. రాజీ మార్గంలో కేసుల పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్‌ని వినియోగించుకోవాలని సూచించారు. సమావేశంలో ఆ జిల్లాల ఈఎస్‌లు, ఏఈఎస్‌లు పాల్గొన్నారు.

మహిళపై కర్రలతో దాడి

నలుగురిపై కేసు నమోదు చేసిన పిఠాపురం రూరల్ పోలీసులు

పిఠాపురం రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పొలం పనులు చేసుకుంటున్న దళిత మహిళపై కర్రలతో దాడి చేసి స్పృహ తప్పేలా కొట్టడంతో పాటు కులంపేరుతో దూషించిన నలుగురు వ్యక్తులపై పిఠాపురం రూరల్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. కాకినాడ జిల్లా కాజులూరు మండలం పందిగరువు గ్రామానికి చెందిన కొత్తివేల మేరీ పిఠాపురం మండలం ఎఫ్‌కేపాలెంలో 20 సెంట్లు పొలంలో సాగు చేసుకుంటుండగా తనపై కే.శివ, రాంబాబు తదితరులు దాడి చేసి కొట్టి గాయపరిచినట్టు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్‌ఐ జానీబాషా తెలిపారు. ఆమెను పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మహిళపై దాడి చేసిన వ్యక్తికి 14 రోజుల రిమాండ్

అమలాపురం టౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మహిళపై దాడిచేసిన కేసులో పులిదిండి వెంకట్రావుకు కోర్టు 14రోజులు రిమాండు విధించడంతో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించినట్టు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం పేరూరు శివారు లంకతోటకు చెందిన జల్లి మంగాదేవిపై అదే ప్రాంతానికి చెందిన పులిదిండి వెంకట్రావు ఈ నెల 21న దాడి చేసి గాయపరిచాడు. ఈ ఘటనలో మంగాదేవి నాలుగు పళ్లు ఊడిపోయాయి. ఎస్‌ఐ మనోహర్ జోషి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దుస్తులు ఆరవేసుకునే విషయంలో జరిగిన ఘటనపై వెంకట్రావును అరెస్ట్ చేసి సోమవారం కోర్టులో హాజరుపరుచగా 14 రోజుల రిమాండు విధించినట్టు సీఐ పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో రేవ్ పార్టీ..
కోనసీమ వాసుల అరెస్ట్!

అమలాపురం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో ఓ అపార్ట్‌మెంట్‌లో జరిగిన రేవ్ పార్టీపై గచ్చిబౌలి పోలీసులు, ఈగల్ టీమ్ దాడి చేసి ఏడుగురిని అరెస్ట్ చేశారు. అయితే అరెస్ట్ అయిన వారిలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గానికి చెందిన ఇద్దరు యువకులు ఉన్నట్టు సమాచారం. వారిలో రావులపాలెం మండలం వెదిరేశ్వరం గ్రామానికి చెందిన తేజారెడ్డి, ఆలమూరు మండలం జొన్నాడకు చెందిన విక్రమ్‌రెడ్డి ఉన్నట్టు భావిస్తున్నారు. వారు హైదరాబాద్‌లో నివాసముంటున్నట్టు తెలుస్తుంది. గతేడాది డ్రగ్స్ కేసులో విక్రమ్‌రెడ్డి ఉన్నారు. అయితే కొత్తపేట సబ్‌డివిజన్ పరిధిలోని పోలీసులకు ఎటువంటి సమాచారం లేదు. హైదరాబాద్ డ్రగ్స్ లింక్‌లపై జోరుగా ఆ ప్రాంతంలో జోరుగా చర్చ జరుగుతుంది.

రెవెన్యూ అధికారి పేరు కూడా...

రాజమహేంద్రవరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో రేవ్ పార్టీ కేసులో రాజమండ్రికి చెందిన రెవెన్యూ అధికారి మణిదీప్ పేరు ఉన్నట్టు ప్రచారం జరిగింది. అయితే దీనిపై ఆయన మాట్లాడుతూ నేను అసలు ఇటీవల హైదరాబాద్ వెళ్లలేదని, ఇక్కడే ఉన్నానని చెప్పారు. అయితే ఈ కేసుపై తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్‌ను ఆరాతీయగా తాము హైదరాబాద్ నుంచి సమాచారం కోరామని, రికార్డులన్నీ పరిశీలించి ఒక స్పష్టత తెస్తామని ఆయన పేర్కొన్నారు.

రేపు ఉమ్మడి జిల్లా సాఫ్ట్‌బాల్ మహిళల జట్టు ఎంపిక

ఐ.పోలవరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సాఫ్ట్‌బాల్ సీనియర్స్ మహిళల జట్టును ఈనెల 27న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా జి.వేమవరం జడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ఎంపిక చేయనున్నట్టు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అడ్డగళ్ళ నాగరాం ప్రసాద్ తెలిపారు. ఈ నెల 30 నుంచి 31 వరకు పల్నాడు జిల్లా దూళిపాళ్ళలో జరిగే స్టేట్ సాఫ్ట్‌బాల్ మీట్‌లో పాల్గొనేందుకు ఈ ఎంపిక జరుగుతుందన్నారు. ఎంపికలో పాల్గొనేవారు ఆధార్ కార్డు, 4 పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు, అసోసియేషన్ ఐడీ కార్డు, జనన ధృవపత్రం తీసుకురావాలని ఆయన తెలిపారు.

కాకినాడ జీజీహెచ్‌లో మేల్‌నర్సు సస్పెన్షన్


నిందితుడు సందీప్ (ఫైల్)

జీజీహెచ్ (కాకినాడ), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మహిళపై అకృత్యాలకు పాల్పడిన కాకినాడ జీజీహెచ్ మేల్‌నర్సు సస్పెన్షన్‌కు గురయ్యాడు. బాధితురాలు ఆదివారం కాకినాడ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో కేసు నమోదయ్యింది. ఆ ఎఫ్ఐఆర్ ఆధారంగా, పత్రికల్లో వచ్చిన ఆధార సహిత వార్తల ఆధారంగా నర్సు మోకా సందీప్‌ను సస్పెండ్ చేస్తున్నట్టు అధికారులు సోమవారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రోజంతా మద్యం మత్తులో ఉండడం, విధులకు కూడా మద్యం తాగి రావడం, నర్సు అయి ఉండి బాధితురాలి నగ్న ఫొటోలు ఆమెకు తెలియకుండా తీసి బ్లాక్‌మెయిల్ చేయడం, ఆమెపై దాడి చేసి అఘాయిత్యానికి పాల్పడడం, ఆమె ఫొటోలను కన్న కొడుకుకు పంపి పైశాచిక ఆనందం పొందడం, ఆ మైనర్‌ను ఆత్మహత్యకు ప్రేరేపించడం అంశాల ను ఎఫ్ఐఆర్‌లో పొందుపర్చిన నేపథ్యంలో ఇవే అంశాల ప్రాతిపదికన సందీప్‌పై సస్పెన్షన్ ఉత్తర్వులను జారీ చేస్తున్నట్టు అధికారులు పేర్కొన్నారు. సందీప్‌పై విధించిన సస్పెన్షన్ సోమవారం నుంచి అమలులోకి వచ్చింది. సందీప్ మద్యం తాగి విధులకు హాజరవుతున్నాడని అతడితో పాటు పని చేస్తున్న మరికొంత మంది మేల్ నర్సులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో అధికారులు ఆ దిశగా దృష్టిసారించారు. ఇది ఇలా ఉంటే నిందితుడు సందీప్ కోసం గాలిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

భర్త కళ్లెదుటే భార్య మృతి

మితిమీరిన వేగంతో వచ్చిన లారీ ఢీకొని ప్రమాదం

కాకినాడ వలసపాకల గంగరాజునగర్‌లో ఘటన

సర్పవరం జంక్షన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మితిమీరిన వేగంతో వచ్చిన లారీ మోటార్ సైకిల్‌ని వెనుక నుంచి ఢీకొనడంతో లారీ చక్రం కింద పడి వివాహిత దుర్మరణం పాలైన సంఘటన సోమవారం కాకినాడ వలసపాకల గంగరాజునగర్ మెయిన్‌రోడ్‌లో జరిగింది. వివరాల్లోకెళితే కాకినాడ డెయిరీఫారమ్ సెంటర్‌కు చెందిన అరికిరెడ్డి సత్యనారాయణ, వెంకటరమణ (51) భార్యాభర్తలు. వారికి ఇద్దరు కుమారులు. సత్యనారాయణ తాపీపని చేస్తుంటాడు. అనారోగ్యంతో పనిలోకి వెళ్లడం లేదు. ఆసుపత్రికి వెళ్లి చూపించుకోవాలని భార్య కోరడంతో సోమవారం ఉదయం డెయిరీఫారమ్ సెంటర్ నుంచి టీవీఎస్-50 మోటార్‌సైకిల్‌పై తోడుగా భార్యను ఎక్కించుకుని వాకలపూడిలో గల కోరమండల్ ఆసుపత్రికి వెళుతున్నారు. మార్గం మధ్యలో వలసపాకల మెయిన్‌రోడ్డు గంగరాజు నగర్ సూర్యకార్ వాష్ వద్దకు వచ్చేసరికి వెనకాల నుంచి మితిమీరిన వేగంతో వచ్చిన లారీ మోటార్ సైకిల్‌ని ఢీకొంది. ఈ ఘటనలో వెంకటరత్నం పై నుంచి లారీ చక్రాలు తొక్కుకుంటూ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. రోడ్డు ప్రమాదంలో కళ్లెదుటే భార్య మృతిచెందడంతో భర్త సత్యనారాయణ కన్నీరుమున్నీరుగా విలపించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తరలించినట్టు సర్పవరం ఏఎస్‌ఐ నాగేశ్వరరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

లక్కవరంలో వ్యక్తి దారుణ హత్య

మంత్రగాడనే అనుమానంతో తల, మొండెం వేరు చేసిన వైనం

మోతుగూడెం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా చింతూరు పోలీస్ సర్కిల్ మోతుగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలో గల లక్కవరం గ్రామంలో నివసిస్తున్న మూట రామయ్య (45) అనే వ్యక్తిని గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం సాయంత్రం దారుణంగా హత్య చేశారు. రామయ్య మంత్రగాడనే నెపంతో చంపినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తల, మొండెంను వేరు చేసి తలను దగ్ధం చేసినట్టు తెలిసింది. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో చింతూరు సీఐ గోపాలకృష్ణ మోతుగూడెం ఎస్‌ఐ సాదిక్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని వారు తెలిపారు.


మూట రామయ్య మృతదేహం

పామాయిల్ తోట ధ్వంసంపై పోలీసులకు ఫిర్యాదు

రాజానగరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తమ పొలంలోకి అక్రమంగా చొరబడి 10 ఎకరాల విస్తీర్ణంలోని పామాయిల్ తోటను నరికేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తూర్పుగోదావరి జిల్లా దివాన్ చెరువు గ్రామానికి చెందిన మంక మల్లిఖార్జునస్వామి అలియాస్ మల్లిబాబు సోమ వారం రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మల్లిబాబు మాట్లాడుతూ కానవరం గ్రామానికి చెందిన సంగిశెట్టి వీరవెంకట్రావు అతడి అనుచరులు సోమవారం రాత్రి చొరబడి సర్వే నంబరు 298/6; 298/7; 298/8 నంబర్లలో 4.86 ఎకరాలు, ఎల్పీ నెంబరు 3159,306,3298, 3300,3585 సర్వే నంబర్లలో 5.25 ఎకరాల పొలంలో పామాయిల్ మొక్కలను రాత్రికి రాత్రి నరికేశారన్నారు. పంట నాశనం చేయడంతో పాటు బోరు మోటారు దొంగిలించి, పొలంలో పనిచేస్తున్న వ్యక్తులను తీవ్రంగా హింసించడమే కాకుండా తనను కూడా చంపుతానని బెదిరింపులకు గుర్తి చేస్తున్నారన్నారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరాడు.


ధ్వంసమైన పామాయిల్ తోట

తాటి బెల్లం వ్యాపారి అనుమానాస్పద మృతి

కరప, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు చెందిన తాటి బెల్లం వ్యాపారి అను మానాస్పద మృతిపై కేసు నమోదు చేసినట్టు కరప ఎస్‌ఐ తోట సునీత తెలిపారు. తమిళనాడు రాష్ట్రం తుతుక్కుడి జిల్లా అయ్యనరుతు మండల కేంద్రానికి చెందిన వెలువెత్తు మురుముత్తు (30), ముత్తు, అల్విన్, ముత్తయ్య పెరుమాళ్‌లు బొలేరో వ్యాన్‌లో పలు రాష్ట్రాల్లో తాటి బెల్లం అమ్ముతూ జీవనం సాగిస్తున్నారు. వ్యాపారంలో భాగంగా పదిరోజుల క్రితం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వచ్చిన వారు ఈనెల 24న కాకినాడ జిల్లా కరప మండలం పెనుగుదురులో తాటి బెల్లం విక్రయించారు. రాత్రికి స్థానిక భారత్ పెట్రోల్ బంక్ వద్ద బొలేరో వాహనాన్ని నిలిపి అందులోనే మద్యం సేవించి, భోజనం చేసి నిద్రపోయారు. సోమవారం ఉదయం పెరుమాళ్ ముత్తయ్య టీ పట్టుకుని వచ్చి వెలువెత్తు మురుముత్తును ఎంతలేపినా నిద్రలేవలేదు. దీంతో అతడిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్టు ధృవీకరించారు. పెరుమాళ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ వివరించారు.

సత్యదేవుడి సన్నిధికి రూ.5 లక్షల విలువైన 2 ఫ్యాన్లు

ముందుకొచ్చిన దాత

అన్నవరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధికి విచ్చేసే భక్తులు వార్షిక కల్యాణమండపం వద్ద సేదతీరేందుకు రూ.5 లక్షల విలువైన 2 హెలికాప్టర్ ఫ్యాన్లను దేవస్థానానికి ఉచితంగా అందించేందుకు లలిత రైస్ ఇండస్ట్రీస్ ఎండీ మట్టే సత్యప్రసాద్ ముందుకొచ్చారు. సోమవారం సత్యదేవుడిని దర్శించిన ఆయన ఈ విషయంపై చర్చించి అంగీకరించారు. రెండురోజుల్లో ఈ ఫ్యాన్లను అమర్చనున్నట్టు దాత తెలిపారు.


ఫ్యాన్ల ఏర్పాటుపై ఈవోతో చర్చిస్తున్న దాత మట్టే సత్యప్రసాద్

డీఎస్సీ ఫలితాల్లో 'శ్యామ్' ప్రతిభ

శ్యామ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ 2025 ఫలితాల్లో కాకినాడ శ్యామ్ ఇనిస్టిట్యూట్‌లో శిక్షణపొందిన విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించినట్టు డైరెక్టర్ జి.శ్యామ్ తెలిపారు. డీఎస్సీ శిక్షణ ప్రారంభించిన మొదటి ప్రయత్నంలోనే వివిధ విభాగాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంకులు, జిల్లా ఫస్ట్ ర్యాంకులతో సంచలన విజయాలను సాధించారని వివరించారు. విద్యార్థులను సోమవారం ప్రత్యేకంగా శ్యామ్ అభినందించారు. ఆరు స్టేట్ ర్యాంకులతో పాటు స్కూల్ అసిస్టెంట్ సోషల్ విభాగంలో జిల్లా టాప్ ర్యాంకుల్లో పదిమంది అభ్యర్థులు విజయం సాధించారని శ్యామ్ పేర్కొన్నారు. ఎస్‌జీటీ విభాగంలో జిల్లా టాప్ ర్యాంకులు సాధించిన తొమ్మిది మంది అభ్యర్థుల వివరాలను కూడా శ్యామ్ వివరించారు. స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన వారిలో బి.హరీష్, బి.దిలేష్, వి.రమ్యశ్రీ, డి.బాలు నాయక్, ఎం.డేనియల్ కుమార్, సీహెచ్ భవాని ఉన్నారన్నారు.


ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న శ్యామ్

కోడిపందాలు ఆడుతున్న 13 మంది అరెస్ట్

రూ.35 వేల నగదు, 3 కోళ్లు, 16 కార్ల స్వాధీనం

నల్లజర్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల బైపాస్ పక్కనే కోడిపందాలు నిర్వహిస్తున్న బృందంపై ఆదివారం రాత్రి పోలీసులు దాడి చేశారు. కోడిపందాలు నిర్వహిస్తున్నట్టు అందిన సమాచారంతో సీఐ బాలచౌరి సిబ్బందితో దాడి చేసి 13 మంది పందెం రాయుళ్లను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.35 వేల నగదు, 3కోళ్లు,16 కార్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు దాడి చేస్తున్నారనే సమాచారం పందెం రాయుళ్లకు చేరడంతో అనేకమంది పారిపోయారు. కార్లలో వచ్చిన వారు తప్పించుకునే మార్గం లేకపోవడంతో పోలీసులకు చిక్కారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న కార్లు

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు

పీజీఆర్ఎస్‌లో కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్



పీజీఆర్ఎస్‌లో అడిషనల్ కమిషనర్‌కు అర్జీ అందజేస్తున్న బొగ్గారపు రస్మిత



రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) ద్వారా వచ్చే అర్జీలకు సత్వర పరిష్కారం చూపించాలని నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ పి.రామలింగేశ్వర్ అన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఆయన పలువురు అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా రామలింగేశ్వర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాసమస్యల పరిష్కార వేదికకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నందున సంబంధిత విభాగాల అధికారులు సమస్యల పరిష్కారంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. వివిధ సమస్యలపై 23 అర్జీలు వచ్చాయని అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా నగరానికి చెందిన బొగ్గారపు రస్మిత దివ్యాంగురాలు. ఆమెకు కేంద్ర ప్రభుత్వ పింఛను ద్వారా నెలకు రూ.15,000 పింఛను వచ్చేది. అయితే రాష్ట్ర ప్రభుత్వ ఇటీవల చేపట్టిన దివ్యాంగ పింఛన్ల సర్వేలో భాగంగా రస్మిత పింఛన్‌ను రూ.6,000కు తగ్గించారు.పూర్తిగా దివ్యాంగురాలనైన తన పింఛన్‌ను రూ.15,000 నుంచి రూ.6,000కు తగ్గించారని, ఇంట్లో గడవడం ఇబ్బంది ఉందని, పాత పింఛనను పునరుద్ధరించి తనను ఆదుకోవాలని సోమవారం ఆమె కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో అడిషనల్ కమిషనర్‌కు అర్జీ అందజేశారు.

నేడు వివేకానంద ఐటీఐలో జాబ్‌మేళా

ధవళేశ్వరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ పరిధిలోని ధవళేశ్వరం గ్రామంలో ఉన్న వివేకానంద ఐటీఐ ప్రాంగణంలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి కె.హరీష్ చంద్రప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తగిన అర్హత కలిగిన నిరుద్యోగ యువత నైపుణ్యం పోర్టల్‌లో తమ వివరాలు, అర్హత నమోదు చేసుకోవాలని తెలిపారు. రిజిస్టర్ చేసుకున్న అభ్యర్థులు ఆధార్‌కార్డు, అర్హత సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో మంగళవారం ఉదయం 10గంటలకు ధవళేశ్వరం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల సమీపంలోని వివేకానంద ఐటీఐ ప్రాంగణానికి రావాలని కోరారు.

పురుగుమందు తాగిన మహిళ మృతి

కడియం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పురుగుమందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందింది. ఎస్ఐ ధనలక్ష్మి వివరాల ప్రకారం..మండలంలోని బుర్రిలంక గ్రామానికి చెందిన వార్డు మెంబర్ ఎం.దుర్గ (29) భర్త చినసూరిబాబుకు దూరపు బంధువైన మట్టా సురేష్ ఆటోడ్రైవర్‌గా జీవనం గడుపుతుంటాడు. దుర్గను అక్క అని సంబోధించేవాడు. ఇద్దరూ స్నేహపూర్వకంగా ఉండేవారు. ఏడాది క్రితం సురేష్ భార్య.. దుర్గతో ఘర్షణ పడింది. ఆ తగాదాను పెద్దమనుషుల సమక్షంలో సర్దుబాటు చేసుకున్నారు. ఐదు నెలలుగా దుర్గను సురేష్ వేధిస్తున్నాడు. దీంతో ఆమె ఈనెల 17న పురుగుల మందు తాగింది. దీంతో ఆమెను ఆసుపత్రికి తరలించారు. 20న పోలీసులకు అందిన సమాచారంతో ఎస్ఐ ధనలక్ష్మి కేసు నమోదు చేశారు. దుర్గ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది.

నిలకడగా గోదావరి ప్రవాహం

ధవళేశ్వరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం నిలకడగా కొనసాగుతుంది. సోమవారం సాయంత్రం కాటన్ బ్యారేజ్ నుంచి 4,98,313క్యూసెక్కుల మిగులు ప్రవాహాన్ని దిగువకు విడుదల చేస్తుండగా ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 10 అడుగులుగా నమోదయింది. వ్యవసాయ అవసరాల కోసం తూర్పుడెల్టాకు 4900క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2500క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 7000 క్యూసెక్కులు చొప్పున సాగునీటిని విడుదల చేస్తున్నారు. ఎగువన అన్ని ప్రాంతాల్లో నీటి మట్టం తగ్గుముఖం పడుతుంది. భద్రాచల వద్ద గోదావరినీటి మట్టం సోమవారం సాయంత్రానికి 29.40 అడుగులుగా నమోదయింది.



రేషన్ అక్రమాలకు స్మార్ట్ చెక్

» ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆర్డీవో కృష్ణనాయక్
» స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకుల పంపిణీలో అక్రమాలకు చెక్ పెడుతూ రేషన్ వ్యవస్థను ప్రక్షాళన చేసేలా లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తున్నట్టు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆర్డీవో కృష్ణనాయక్ అన్నారు.మండలంలోని హుకుంపేటలో, రాజవోలు పంచాయతీ ఆవరణలో సోమవారం లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఏటీఎం కార్డు తరహాలో స్మార్ట్ కార్డులు రూపకల్పన జరిగిందన్నారు. కార్డుపై వున్న క్యూఆర్ కోడ్ ద్వారా రాష్ట్రంలో ఎక్కడివారైనా ఎక్కడ నుంచైనా రేషన్ పొందేలా రూపొందించారన్నారు. రూరల్ మండల పరిధిలో 59 షాపులకు సంబంధించి 50,175 స్మార్ట్‌కార్డులు, కడియం మండలంలో 28,666 స్మార్ట్ కార్డులు పంపిణీ చేయనున్నట్టు చెప్పారు. ఈ నెల 31 వరకు గ్రామ సచివాలయ సిబ్బంది లబ్ధిదారులకు నేరుగా పంపిణీ చేస్తారన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, ఎంఎస్‌వో సూర్య ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శులు కాశీవిశ్వనాథ్, శ్రీనివాసరెడ్డి, సచివాయ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో స్మార్ట్‌కార్డ్ అందజేస్తున్న ఎమ్మెల్సీ వీర్రాజు

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం 11వ డివిజన్‌లోని వీఎల్ పురం పార్కు సమీపంలోని రేషన్‌షాపు వద్ద సోమవారం మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యర్రా వేణుతో కలసి స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. అనంతరం తిలక్‌రోడ్డులోని సాయిబాబా గుడి వద్ద భక్తులకు వినాయక మట్టి ప్రతిమలను అందజేశారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ రేషన్ బియ్యం దుర్వినియోగం కాకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. స్మార్టు కార్డుల్లో క్యూఆర్ కోడ్ వల్ల రేషన్ తీసుకోగానే ఆ సమాచారం కేంద్ర, జిల్లా కార్యాలయాలకు అందుతుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం అర్బన్: నగరంలోని 49వ డివిజన్ సుబ్బారావునగర్‌లో 94వ నెంబరు రేషన్‌షాపు వద్ద స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్డుపై ఉన్న క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే కుటుంబ సభ్యుల వివరాలు, రేషన్ సరుకుల కేటాయింపు, ఈకేవైసీ స్థితి వంటి పూర్తి వివరాలు అందుబాటులో ఉంటాయన్నారు. కూటమి నాయకులు బొమ్ముల దత్తు, రేలంగి శ్రీదేవి, వెంకట నాగేంద్ర, మీనాక్షమ్మ పాల్గొన్నారు.

ధవళేశ్వరం: స్థానిక పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి జి.వెంకట్రావు, వీఆర్వోలు, కూటమి నాయకులు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించారు. రేషన్ సరుకుల బ్లాక్ మార్కెట్‌ను అరికట్టడానికి ప్రభుత్వం స్మార్ట్ కార్డులు ప్రవేశపెట్టిందని, అర్హులందరికీ కార్డులు జారీ చేస్తారని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ తలారి మూర్తి పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆళ్ళ ఆనందరావు, యడ్ల మహేష్, ఎరుపల్లి సత్తిబాబు, దిండి జగదీష్, నాళ్ళ రమేష్, యడ్ల వెంకటేష్, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.



హుకుంపేటలో స్మార్ట్‌కార్డ్‌లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గోరంట్ల, ఆర్డీవో కృష్ణనాయక్

స్మార్ట్ వివక్ష.. వీఆర్వోపై ఫిర్యాదు

కడియం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన స్మార్ట్‌కార్డుల పంపిణీలో దళితులు, బీసీలపై వివక్ష చూపారంటూ జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్ సోమవారం రాజమహేంద్రవరం ఆర్‌డీవో కార్యాలయంలో ఇన్‌చార్జి ఏవో సుగుణకుమారికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ స్మార్ట్‌కార్డుల పంపిణీ సచివాలయం వద్ద కాకుండా ప్రైవేటు స్థలంలో చేశారని, సర్పంచినైన తనను ఆహ్వానించలేదని, బీసీ ఎస్సీ కులానికి చెందిన ఎవరిని ఈ కార్యక్రమానికి పిలవలేదని తెలిపారు. వీఆర్‌వోపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

స్వచ్ఛ రథాలతో వినియోగదారుడికి లబ్ధి



హుకుంపేటలో స్వచ్ఛ రథాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గోరంట్ల

ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మొబైల్ వాహనాల(స్వచ్ఛ రథాలు) వల్ల ఇళ్లలో పనికిరాని వస్తువులు సేకరించి, వారికి అవసరమైన నిత్యావసరాలు అందజేయడం ద్వారా వినియోగదారుడికి లాభం చేకూరడంతో పాటు పరిసరాల పరిశుభ్రత పెరుగుతుందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు.ఇళ్లల్లో వృథాగా పడి ఉన్న ప్లాస్టిక్ వస్తువులు, పుస్తకాలు ఉపయోగపడని ఇతర వస్తువులను సేకరించి వాటి ధరకు సమానమైన నిత్యావసర వస్తువులను అందజేసే రెండు స్వచ్ఛ రథాలను సోమవారం హుకుంపేట పంచాయతీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే గోరంట్ల ప్రారంభించారు. అలాగే నియోజకవర్గం పరిధిలోని 16వ వార్డు తూర్పు రైల్వేస్టేషన్ రోడ్డు ప్రాంతంలో రూ.22.50 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించే సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే గోరంట్ల శంకుస్థాపనకు చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లు, డ్రయిన్లు ఆక్రమిస్తూ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, వాటన్నింటినీ తొలగించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వం చేసిన నిర్వాకం కారణంగా రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సమర్ధవంతంగా సంక్షేమం, అభివృద్ధి వైపు తీసుకెళుతున్నారన్నారు. కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్మన్ మార్నివాసుదేవరావు, డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్, ఎంపీడీవో ఆర్మ్‌స్ట్రాంగ్,తహసీల్దార్ శ్రీనివాసరావు, చలుమూరి సత్యనారాయణ, ఎంఎంఎల్ రాజు, సింగవరపు సత్యనారాయణ, అడపా వరప్రసాద్, సుబ్బాయమ్మ, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తెలుగుభాష విశిష్టతను చాటిచెప్పాలి

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : గొప్ప సాంస్కృతిక వారసత్వం కలిగిన తెలుగుభాష విశిష్టతను ప్రతి స్త్రీ చాటి చెప్పాలని ఎస్‌కేఆర్ డీఎడ్ కళాశాల తెలుగు విభాగాధిపతి పి.విశాలాక్షి అన్నారు. తెలుగు సారస్వత పరిషత్, తెలుగు కళా గౌతమి నిర్వహిస్తున్న తెలుగు మాట పండుగ రాజమహేంద్రి కళాశాలలో సోమవారం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన విశాలాక్షి మాట్లాడుతూ తల్లిదండ్రులు మాతృభాషకు విలువ ఇవ్వాలని అన్నారు. ఇతర ప్రాంతాల వాళ్లు తమ భాషల పట్ల చూపుతున్న మమకారాన్ని మనం కూడా పెంపొందించుకోవాలని సూచించారు. రాజమహేంద్రి కళాశాల ప్రిన్సిపాల్ సౌందర్య స్వరూప్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

ఆచార వ్యవహారాలకు పెట్టింది పేరు...

కాగా, పుష్కరఘాట్ వద్ద జరిగిన తెలుగు పేరంటం కార్యక్రమానికి జక్కంపూడి విజయలక్ష్మి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. సంప్రదాయానికి, ఆచార వ్యవహారాలకు తెలుగు భాష పెట్టింది పేరని, భాషను నిలబెట్టినపుడే ఇవన్నీ నిలబడతాయని అన్నారు. ఈ సందర్భంగా గోదావరి మాతకు తొలి పేరంటాన్ని విద్యార్థినులతో ఇప్పించారు. కాలభైరవ సంస్థాన పీఠం అధ్యక్షుడు శివస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీదేవి, విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కోరుకొండలోని శ్రీ వెంకట సత్య సప్లయి కంపెనీలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో తీవ్రంగా నష్టపోయిన యజమాని ఎం. నరసింహరావుకు ది.రాజమండ్రి సౌండ్ అండ్ లైటింగ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేష్ ఆర్థిక సాయం అందజేసింది. అసోసియేషన్ సభ్యుల సహాయంతో రూ.23,616 నగదు, రూ.12,500 ఖరీదు చేసే 50 హ్యాండ్‌లెస్ ప్లాస్టిక్ కుర్చీలు సహాయంగా అందజేసినట్టు అసోసియేషన్ ప్రశిడెంట్ గుల్లిపల్లి వెంకటేశ్వరరావు, సెక్రటరీ వసంత్ కుమార్ తెలిపారు. గౌరవాధ్యక్షుడు బొట్ల సూర్యారావు ఆధ్వర్యంలో ఈ సహాయాన్ని అందజేశామని పేర్కొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులతో అక్రమాలకు చెక్

• నియోజకవర్గంలో 85వేల కార్డుల పంపిణీకి ఏర్పాట్లు • ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ



శ్రీకృష్ణపట్నంలో స్మార్ట్‌కార్డును అందజేస్తున్న ఎమ్మెల్యే బత్తుల

కోరుకొండ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలకు తావులేకుండా స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తు న్నట్టు రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. గాడాల సచివాల యం వద్ద స్మార్ట్ కార్డులను సోమవారం ఆయన పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తోంద దన్నారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బం దులున్నా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తుందన్నారు. రాజానగరం నియోజక వర్గంలో 85,101 స్మార్ట్ కార్డులను అందజేస్తా మన్నారు. రేషన్ పంపిణీ అత్యంత పకడ్బం దీగా మారనుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు అడ్డాల శివ, ముక్కా రాంబాబు, అడ్డాల శ్రీను, డీలర్ల సంఘం నాయకులు ఎం.సీతారాముడు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారదర్శకతకు పెద్దపీట

దివాన్‌చెరువు, (ఆంధ్రజ్యోతి): ప్రజా పంపిణీలో అక్రమాలకు తావులేకుండా పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నట్టు రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తెలిపారు. రాజానగరం మండలం శ్రీకృష్ణపట్నం గ్రామంలో సచివాలయం వద్ద స్మార్ట్‌రేషన్ కార్డులను సోమవారం ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎంతో పకడ్బందీగా స్మార్ట్‌రేషన్ కార్డులను రూపొందించిందన్నారు. ప్రస్తుతం ఇస్తున్న స్మార్ట్‌కార్డులలో కుటుంబ యజమాని ఫొటో కుటుంబ సభ్యుల పేర్లు ఉంటాయన్నారు. రాజానగరం తహసీల్దార్ జీఎస్ఎల్ దేవి మాట్లాడుతూ రాజానగరం మండలంలో 36వేల131 స్మార్ట్ రేషన్ కార్డులు అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో శ్రీకృష్ణపట్నం సర్పంచ్ కిమిడి శ్రీరామ్, పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ గణేష్‌కుమార్, ఎంపీడీవో జె.ఏ.ఝాన్సీ, ఎంఎస్‌వో బాపిరాజు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దివాన్‌చెరువు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువులోని విద్యుత్ ఉపకేంద్రం నుంచి సరఫరా అయ్యే ఫీడర్‌నకు మరమ్మతుల నిమిత్తం మంగళవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం రూరల్ ఆపరేషన్ కార్యనిర్వాహక ఇంజనీర్ జెవిబి నటరాజన్ సోమవారం తెలిపారు. దివాన్‌చెరువు పండ్ల మార్కెట్ ప్రాంతం, సాదుపైట, ఎస్సీకాలనీ, పాలచర్ల, ఆంధ్రజ్యోతి కార్యాలయం ప్రాంతం, హైవే రోడ్, జెహెచ్‌సి కాలనీలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు.

తెలుగు భాషా సేవా పురస్కారానికి ధర్మేష్ ఎంపిక

సీతానగరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) బొబ్బిల్లంక గ్రామానికి చెందిన నక్కిన ధర్మేష్ తెలుగు భాషా సేవా పురస్కారం అవార్డుకు ఎంపికయ్యారు. అంతర్జాతీయ సాంస్కృతిక సంస్థ శ్రీశ్రీ కళావేదిక ప్రతి సంవత్సరం అందించే ఈ పురస్కారం తెలుగు సాహిత్యంలో కృషి చేస్తున్న ప్రతిభావంతులకు ప్రదానం చేస్తారు ఈనెల 31న పల్నాడు జిల్లా, నర్సరావుపేటలో ధర్మేష్‌కు అవార్డును ప్రదానం చేయనున్నట్లు అంతర్జాతీయ సాంస్కృతిక సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఛైర్మన్ డాక్టర్ కె.ప్రతాప్ తెలిపారు. అవార్డుకు ఎంపికైన ధర్మేష్ ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలిపారు. అవార్డు గ్రహీతను పలువురు కవులు, విద్యావేత్తలు అభినందించారు

మహిళా సాధికారత టీడీపీకే సాధ్యం

ఎమ్మెల్యే నల్లమిల్లి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారత చంద్రబాబుతోనే సాధ్యమని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వంలో సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయిన సందర్భంగా సోమవారం అనపర్తి మెయిన్ రోడ్డులో మహిళలతో సభ నిర్వహించారు. ఈ సభకు నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు జుత్తుగ సూర్యకుమారి అధ్యక్షత వహించారు. ముందుగా బిక్కవోలు బస్టాండ్ నుంచి రావులపాలెం వెడుతున్న ఆర్టీసీ బస్సులో మహిళలతో ప్రయాణిస్తూ అనపర్తిలోని సభాస్థలికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు ఎమ్మెల్యే నల్లమిల్లి, టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డిలకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే ప్రసంగించారు. కూటమి చేస్తున్న సంక్షేమ పథకాల అమలును ఓర్వలేని వైసీపీ విమర్శలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. నియోజకవర్గం అభివృద్ధికి చేస్తున్న కృషికి ప్రజల నుంచి మన్ననలు పొందుతున్నానని త్వరలో కెనాల్ రోడ్డు అభివృద్ధి కూడా సాధిస్తామన్నారు. దేవాలయాల అభివృద్ధికి ఇప్పటికే నిధులు మంజూరు అయ్యాయన్నారు. బిక్కవోలు, మామిడాడ ఆలయాల అభివృద్ధికి కేంద్రానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి నాడు ఎన్‌టీఆర్, నేడు చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. ముందుగా ఇటీవల గిన్నిస్ రికార్డు సాధించిన హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు శుభాకాంక్షలు తెలుపుతూ అభిమానులు ఏర్పాటు చేసిన కేక్‌ను ఎమ్మెల్యే కట్ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, ఆళ్ళ గోవిందు, వెలుగుబంటి సత్తిబాబు, త్రిమూర్తులు, కర్రి శేషారత్నం, ఎంపీపీ సుమ, మాజీ ఎంపీపీ బేరా వేణమ్మ, నాలుగు మండలాల కూటమి నాయకులు పాల్గొన్నారు.

మహిళల కృతజ్ఞతలు

బిక్కవోలు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): అనపర్తిలో ఉచిత బస్సు పథకం ప్రారంభించిన సందర్భంగా ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభకు ఎమ్మెల్యే నల్లమిల్లి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మనోజ్‌రెడ్డి బిక్కవోలు నుంచి బస్సులో వెళ్లారు. కూటమి ప్రభుత్వానికి మహిళలు కృతజ్ఞలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట కూటమి నేతలు బేరా వేణమ్మ, జుత్తుగ సూర్యకుమారి, పల్లి వాసు, తనుకు శ్రీధర్ తదితరులు వున్నారు.

రైతులకు సకాలంలో సాగునీరు అందించాలి

రాజానగరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెం రిజర్వాయర్ ద్వారా రైతులకు వెంటనే సాగు నీరు అందించాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆదేశించారు. రైతులు, రిజర్వాయర్ అధికారులతో ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో గాదరాడ, కణుపూరు, రాజ వరం గ్రామాల్లో ముఖ్యమైన ఊరచెరువు, ముంద్రువారి చెరువు, అప్పయ్య చెరువుల్లో నీరు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే వారికి సాగునీరు అందించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

అనపర్తి, ఆగస్టు, 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల సైబర్ నేరాలు పెరగడం ఆందోళన కలిగిస్తోందని ఎస్ఐ శ్రీను నాయక్ అన్నారు. అనపర్తి మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ఉల్లాస్ శిక్షణా కార్యక్రమాల్లో భాగంగా సోమవారం ఎస్ఐ శ్రీను నాయక్ మహిళలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ తెలియని లింక్‌లపై క్లిక్ చేయ డం ద్వారా అకౌంట్లలో డబ్బులు మాయం అవుతున్నాయన్నారు. సమావేశంలో తహసీల్దార్ అనిల్ కుమార్, ఎమ్‌పీడీవో రామకృష్ణారెడ్డి, ట్రైనీ ఎస్ఐ సుజాత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీలక్ష్మి

బాల్య వివాహాల నివారణపై అవగాహన

కోరుకొండ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నివారణపై ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాల పట్ల అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిస అవుతున్నారని వారిని దాన్నుంచి విముక్తి కలిగించేలా కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కోమల, సీడీపీవో సంధ్యారాణి, డీసీపీఓ అనంత ప్రదీప్, పీఓఎస్ఐసీ క్రాంతిలాల్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ టీమ్, క్రాఫ్ ఆర్గనైజేషన్ టీమ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పనిచేసే ప్రాంతంలోనే నివాసం ఉండాలి

గోకవరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య సిబ్బంది పనిచేసే ప్రాంతంలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని పలువురు ఎంపీటీసీ సభ్యులు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ సుంకర శ్రీవల్లి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా పలువురు సభ్యులు, సర్పంచ్‌లు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే సిబ్బందిలో చాలామంది రాత్రివేళల్లో ఉండడం లేదని, దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. యూరియా కొరతను నివారించి, రైతుల ఇబ్బందులను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. మండలంలోని వివిధ ప్రాంతాల్లో సుమారు కోటి 70లక్షలతో ఆర్‌అండ్‌బీ పనులు జరుగుతున్నాయని ఏఈ వీరన్న తెలిపారు. ప్రమాదంగా మారిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసినట్లు విద్యుత్ ఏఈ సుబ్రహ్మణ్యం సభ్యులకు వివరించారు. సమావేశంలో ఎంపీడీవో గోవిందుతో పాటు. పలు గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఉత్తమ ఎంపీడీవోగా ఎన్నికై కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఎంపీడీవో గోవిందును ఎంపీపీ శ్రీవల్లి, సభ్యులు తదితరులు ఘనంగా సత్కరించారు.



మాట్లాడుతున్న చైతన్యరాజు

ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలి

జీజీయూ చాన్సలర్ చైతన్యరాజు

రాజానగరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): భావి ఇంజనీర్లు ఉన్నత లక్ష్యాలు నిర్ణయించుకుని, వాటిని సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని జీజీయూ ఛాన్సలర్ చైతన్యరాజు ఆకాంక్షించారు. గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం(జీజీయూ), గైట్ ఇంజనీరింగ్ కళాశాల సంయుక్తంగా నిర్వహించిన మొదటి సంవత్సరం విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశం సోమవారం నిర్వహించారు. దీనికి జీజీయూ ఛాన్సలర్ చైతన్యరాజు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. కార్యక్రమంలో జీజీయూ ఉపకులపతి యు.చంద్రశేఖర్, ప్రోవైస్ చాన్సలర్ కేవీబీ రాజు, రిజిస్ట్రార్ పిఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ ఎంవిఎస్ బాబు, వివిధ విభాగాల డైరెక్టర్లు, అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవ కమిటీలకు అవగాహన

కోరుకొండ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నార్త్ జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ ఉత్తర్వుల ప్రకారం సీఐ సత్యకిషోర్, ఎస్ఐ కేవీ నాగార్జున సోమవారం కోరుకొండ పోలీస్‌స్టేషన్ వద్ద ఆయా కమిటీలకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. వినాయక చవితి పురస్కరించుకుని పాటించాల్సిన నిబంధనలు, జాగ్రత్తలు , సూచనలు చేశారు. వినాయక మండపాల వద్ద ఆయా నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

చిట్టి చేతులు..మట్టి గణపతులు

బిక్కవోలు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కొంకుదురు ఉన్నత పాఠశాలలో పీడీ డి.యువరాజారెడ్డి ఆధ్వర్యంలో చిట్టి చేతులు-మట్టి గణపతులు కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలలో ఆరు నుంచి పది వరకూ చదివే విద్యార్థులు బంకమట్టితో గణపతి విగ్రహాలను తయారు చేసి సోమవారం పాఠశాలలో ప్రదర్శించారు. ప్రతి ఒక్కరూ మట్టి గణపతులనే పూజించాలని హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి వారికి తెలిపారు.

విగ్రహాల తయారీపై శిక్షణ

గోకవరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మళ్ళదొడ్డి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సోమవారం మట్టి వినాయకుని విగ్రహాల తయారీలో శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని విగ్రహాలను తయారు చేశారు. పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు కె.లక్ష్మీకాంతం మట్టి వినాయకుని విగ్రహాల తయారీ వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు.



బిక్కవోలు మండలం కొంకుదురు ఉన్నత పాఠశాలలో విద్యార్థులు చేసిన మట్టి గణపతులు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
మంగళవారం 26 ఆగస్టు 2025 | 5





వారం రోజులు.. రూ.10 లక్షలు వసూలు!

రాజమహేంద్రవరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): హెల్మెట్ పెట్టుకోకపోతే అంతే సంగతి.. ఎక్కడైనా పోలీసులకు చిక్కారా కేసు రాస్తున్నారు.. జిల్లాలో హెల్మెట్ వినియోగంపై ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టారు. ఈ నెల 18 నుంచి 24 వరకూ వారం రోజుల్లో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో చేపట్టిన తనిఖీల్లో 1016 కేసులు నమోదు చేసి రూ.10.16 లక్షలు ఈ-చలానాలు విధించారు. ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిందేనని ఎస్పీ నరసింహ కిశోర్ స్పష్టం చేశారు. హెల్మెట్ వాహన చోదకులు అలవాటుగా చేసుకోవాలన్నారు.

16 కార్లు స్వాధీనం..13 మంది అరెస్ట్ 8

వినాయక మండపాలకు ఉచిత విద్యుత్

- మంత్రి లోకేశ్ చొరవతో ప్రభుత్వ నిర్ణయం
- ఉమ్మడి జిల్లాలో ఉత్సవ కమిటీలకు ఊరట
- వచ్చేనెలలో విజయదశమికి ఏర్పాటు చేసే మండపాలకూ ఉచిత విద్యుత్ సౌకర్యం

పిఠాపురం,ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే మండపాలు, పందిర్లకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఉత్సవాలు జరిగే అన్నిరోజుల్లో ఉచిత విద్యుత్ అందజేయాలని వివిధ గణేష్ ఉత్సవ సమితులు, మండపాల నిర్వాహకులు రాష్ట్ర ఐటీ,విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యుత్‌శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్‌లతో ఆయన చర్చించారు. దీంతో ఉచిత విద్యుత్ అందజేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని లోకేశ్ ట్విట్టర్(ఎక్స్), ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు. దసరా సందర్భంగా ఏర్పాటు చేసే మండపాలకు కూడా ఉచిత విద్యుత్‌ను అందించనున్నారు.

విద్యుత్ భారం నుంచి ఉపశమనం

వినాయక చవితి సందర్భంగా జరిగే నవరాత్రి ఉత్సవాలు జరిగే అన్ని రోజులకు విద్యుత్ సరఫరా నిమిత్తం నిర్వాహకులు తాత్కాలిక కరెంటు కనెక్షన్ తీసుకోవడం లేదా ఇతర కనెక్షన్లనుంచి సరఫరా తీసుకుని సొమ్ములు చెల్లించేవారు. ఇప్పుడు ఆ బాధ తప్పింది. దీనివల్ల కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల పరిధిలో 7,500 పెద్ద, మధ్య తరహా వినాయక మండపాలు, మరో 10వేల వరకూ చిన్నతరహా మండపాలు, పందిర్ల నిర్వాహకులకు ఉపశమనం కలగనుంది. ఈ మండపాలన్నింటికీ ఉచిత విద్యుత్ ఎలా అందించాలనే విషయమై రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేస్తుందని ఏపీఈపీడీసీఎల్ అధికారులు తెలిపారు. దానికి అనుగుణంగా కరెంటు కనెక్షన్లు ఇస్తామని ఆయన చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.25కోట్లు, ఉమ్మడి జిల్లాకు సంబంధించి రూ.4కోట్ల వరకూ ఉచిత విద్యుత్‌కు అయ్యే వ్యయాన్ని ప్రభుత్వం భరించనుంది. మండపాలకు ఉచిత విద్యుత్ అందించేలా చొరవ తీసుకున్న మంత్రి నారా లోకేశ్‌కు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.



ఓపిక.. నశిస్తోంది!

ప్రభుత్వ ఆసుపత్రికెళితే.. రోగులకు తప్పని అవస్థ



పాపం పెద్ద పరీక్షే: గోకవరం ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం రక్త పరీక్షలకు రోగుల క్యూ

రోగం తగ్గించుకుందామని ప్రభుత్వాసుపత్రికి వెళుతుంటే ఓపీ చీటి చేతికందేలోపునే కొత్త రోగం వచ్చేలా ఉంది పరిస్థితి.. ఈ సంఘటనే అందుకు ఉదాహరణ.. గోకవరం మండలంలోని గుమ్మళ్లదొడ్డి గ్రామానికి చెందిన సూరంపూడి నాగు అనారోగ్యానికి గురవ్వడంతో సోమవారం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చాడు.. రెండు గంటల పాటు నిలబడి ఓపీ చీటీ రాయించుకున్నాడు.. వైద్యుడి గది వద్దకు వెళ్లి కొంతసేపు నిలబడే సరికి అనారోగ్యంగా ఉండడంతో బాగా నీరసించి స్పృహతప్పి పడిపోయాడు. వెంటనే అతని బంధువులు, ప్రక్కనే ఉన్న రోగులు కలిసి వైద్యుడి వద్దకు తీసుకెళ్లగా వెంటనే సెలైన్ ఎక్కించారు.. ప్రతి రోజూ ఇటువంటి కేసులు నమోదవుతూనే ఉన్నాయి.. ప్రభుత్వాసుపత్రికి వెళుతుంటే వైద్యుడిని కలవడానికే గంటల సమయం పట్టడంతో రోగుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు..

గోకవరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద ఓపీ చీటీ పొందాలంటే గంటల తరబడి నిరీక్షించాల్సిందే.. మీ ఒంట్లో ఉన్న రోగానికంటే మరెక్కువ సహనం ఉండి తీరాల్సిందే.. అపుడు కూడా మీ దగ్గర ఫోన్ ఉంటేనే. ఒక వేళ ఫోన్ లేకపోయినా.. నిలబడే ఓపిక నశించినా ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగెత్తాల్సిందే.ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపీ చీటీకి ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆన్ లైన్ విధానం..సాయంత్రం 4 గంటల నుంచి ఆఫ్ లైన్ విధానం కొనసాగుతోంది.ఇదీ నిత్యం జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల వద్ద రోగుల అవస్థలు.

- ఓపీ కోసమే గంటల తరబడి క్యూ
- ఆ తరువాత వైద్యుడి వద్దా ఇంతే
- అభయా యాప్‌లో నమోదైతేనే చీటీ
- ల్యాబ్ పరీక్షలంటే రోజు తప్పదు
- ఇబ్బందులు పడుతున్న రోగులు
- నీరసించి పడిపోతున్న జనం
- పట్టించుకోని ఉన్నతాధికారులు

వందలాది మంది రోగులు.. ఒక్కరే ల్యాబ్ టెక్నీషియన్

గోకవరం ప్రభుత్వాసుపత్రి అటు ఏజెన్సీకి అనుసంధానంగా ఉంటుంది. దీంతో ప్రతిరోజు ఓపీ వందల్లోనే ఉంటుంది. అటువంటి ఆసుపత్రిలో ఒకే ఒక్క ల్యాబ్ టెక్నీషియన్ డిప్యుటేషన్‌పై విధులు నిర్వర్తించడం విస్మయానికి గురిచేస్తుంది. ఓపీని తట్టుకోలేక ఇక్కడ పనిచేసే టెక్నీషియన్లు బదిలీపై వెళ్లిపోతున్నారు. దీంతో ప్రస్తుతం అనపర్తి, కడియం ఆసుపత్రుల నుంచి ల్యాబ్ టెక్నీషియన్లు వచ్చి విధులు నిర్వర్తిస్తున్నారు. అసలే ఓపీ ఆలస్యం అవుతుందంటే మరో వైపు రక్త పరీక్షల రిపోర్టులు సమయానికి అందక రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. ల్యాబ్ టెక్నీషియన్లను పెంచాలని కోరుతున్నారు.



జిల్లా ఆసుపత్రిలోనూ ఇంతేగా..

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి (జీజీహెచ్) సోమవారం రోగులతో కిటకిటలాడింది. ఓపీ విభాగంలో నెట్‌వర్క్ సమస్య, సర్వర్ డౌన్‌తో పాటు సిబ్బంది వేగంగా రిజిస్ట్రేషన్లు చేయకపోవడం తదితర కారణాలతో రోగులు, వారి బంధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రిజిస్ట్రేషన్ల కోసం, ఓపీ చీటీ కోసం, టెస్టుల కోసం, మాత్రల కోసం రోగులు, వారి సహాయకులు గంటల కొద్దీ నానా యాతనా పడాల్సి వస్తోంది. సాధారణ జలుబు, జ్వరం వంటి చిన్న రోగంతో జీజీహెచ్‌కు వచ్చినా ఒక పూట గడిచిపోతోంది.దీంతో ఆసుపత్రికొచ్చే రోగులు, వారి కుటుంబీకులు అసంతృప్తికి గురవుతున్నారు. అయినా ఓపీ విభాగం వద్ద సమస్యను అధికారులు పట్టించుకోవడంలేదు. జిల్లా ఉన్నతాధికారులు సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆసుపత్రికెళితే.. అ..భయమే!

గతంలో ఆసుపత్రికి వెళితే మామూలుగా లైన్‌లో నిలబడితే రోగులను బట్టి ఓపీ చీటు లభించేది. కానీ ఇపుడు ఓపీ విధానం మారిపోయింది. ఓపీ చీటు తీసుకునేందుకు రోగుల వివరాలను ఆసుపత్రి సిబ్బంది అభ యాప్‌లో నమోదు చేస్తారు. అపుడు రోగి ఫోన్‌కు ఓటీపీ నెంబరు వస్తుంది. ఆ తరువాత సిబ్బంది టోకెన్ నెంబరు కేటాయిస్తారు.ఆ నెంబరు తీసుకుని మరో కౌంటర్‌కు వెళ్లాలి. అక్కడున్న సిబ్బందికి మనకున్న ఇబ్బందులు చెబితే ఏ వైద్యుడి వద్దకు వెళ్లాలో ఆ రూమ్ నెంబరును ఓపీ చీటీపై వేసిస్తారు. అప్పటికే ఓపీ చీటీ కోసం గంటల తరబడి నిలబడి ఉన్న రోగులకు ఓపిక అయిపోతుంది. మళ్లీ వైద్యుడి రూమ్ వద్దకు వెళ్లి ఓపిక పట్టాలి. వైద్యుడి దగ్గరికి వెళ్లాక ఆయన రక్త పరీక్షలు రాస్తే మరింత నరకం చూడాల్సిందే.ఆ పరీక్షల రిపోర్టు వచ్చిన తరువాత మరోమారు వైద్యుడిని సంప్రదించాక ఆయన చీటీపై రాసిన మందులను తీసుకొని ఇంటికెళ్లాలి. దీంతో రోగుల ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఉన్నతాధికారులు స్పందించి ఓపీ నమోదులో సవరణలు చేస్తే బాగుంటుందని రోగులు కోరుకుంటున్నారు.

ఉదయం 6.30 గంటలకు వచ్చా..



మా అబ్బాయికి జ్వరం రావడంతో ఉదయం 6.30 గంటలకు ఆసుపత్రికి వచ్చి వైద్యుడి సంప్రదించగా రక్త పరీక్షలు రాశారు. సమయం 11 గంటలు దాటినా ఇంకా పరీక్ష కేంద్రంలోకి వెళ్లలేక పోయా. - మద్దా రమణ, అచ్చుతాపురం

రక్త పరీక్షలు ఆలస్యం..



నా కుమార్తెకు జ్వరంగా ఉండడంతో ఉదయం 9 గంటలకు రక్తపరీక్షలు చేయిద్దామని.. సమయం 11 గంటలు దాటింది.నా ముందు సుమారు 25 మంది పైన రక్త పరీక్షలు కోసం వచ్చినవారున్నారు. - సంకరమ్మ, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ

ఆసుపత్రికి వచ్చాక నొప్పి ఎక్కువైంది..



కాలు నొప్పి చూపించుకుందామని ఉదయం 8 గంటలకు వచ్చా. 11:30 గంటలు దాటినా పరీక్షలు పూర్తి కాలేదు. ఉన్న నొప్పి కంటే ఆసుపత్రికి వచ్చి తెచ్చుకున్న నొప్పి మరింత ఎక్కువైంది. - కిల్లాడి వెంకటలక్ష్మి, వీరలంకపల్లి

టీడీపీ జిల్లా అధ్యక్షుడెవరో!

నేడు మధురపూడిలో త్రిసభ్య కమిటీ సభ్యుల సమావేశం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

టీడీపీ జిల్లా అధ్యక్ష పదవికి పోటీ పెరిగింది.మాజీ మంత్రి కెఎస్ జవహర్‌కు ఎస్సీ కమిషన్ చైర్మన్ పదవి రావడంతో జిల్లా అధ్యక్ష పదవికి దూరమైన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి పార్టీ జిల్లా అధ్యక్ష పదవి ఖాళీగా ఉంది. గత మే నెలలో మహానాడు నాటికి కొత్త కమిటీల ఎన్నుకోవాల్సి ఉంది.కానీ ఇప్పటి వరకూ సంస్థాగత ఎన్నికలు నిర్వ హిస్తున్నారు. ప్రస్తుతం జిల్లా కమిటీతో పాటు, ఆయా నియోజకవర్గాల నుంచి రాష్ట్ర కమిటీ లోకి ఎవరిని తీసుకోవాలనేది నిర్ణయించ నున్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు త్రిసభ్య కమిటీ మంగళవారం జిల్లాకు రానుంది. త్రిసభ్య కమిటీ సభ్యులుగా మంత్రి కొలుసు పార్థసారథి,ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఉన్నారు. మధురపూడి విమానాశ్రయం సమీపంలోని రాజానగరం టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఉద యం 10 గంటలకు సమావేశం నిర్వహి స్తారు.ఈ సమావేశానికి జిల్లాలోని టీడీపీ ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి వాసు, మద్దిపాటి వెంకట్రాజు, ముప్పిడి వేంకటేశ్వర రావుతో పాటు రాజానగరం ఇన్‌చార్జి బీవీఆర్ చౌదరి,నిడదవోలు ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు,అనపర్తి నుంచి నల్లమిల్లి మనోజ్ రెడ్డితో పాటు ఆయా నియోజకవర్గాల పరిధిలోని ముఖ్యనేతలంతా హాజరు కానున్నారు. వీరి నుంచి త్రిసభ్య కమిటీ అభిప్రాయాలు సేకరించి జిల్లా కమిటీ, రాష్ట్ర కమిటీ సభ్యుల పేర్లను ప్రతిపాదించి, అధిష్ఠానానికి సమర్పిస్తుంది.అధిష్ఠానం పరిశీలించి త్వరలోనే అధికారికంగా ప్రకటించనుంది. కానీ ఇక్కడ ఇంకా ఏ వర్గానికి ఇవ్వాలనేదానిపై స్పష్టత లేదు. జిల్లాలోని అందరి అభిప్రాయాలు తీసు కున్న తర్వాత కమిటీ ప్రతిపాదించిన పేర్ల నుంచే అధిష్ఠానం జిల్లా అధ్యక్షుడిని, కమిటీని ప్రకటిస్తుంది. ప్రస్తుతం అనేక మంది జిల్లా, రాష్ట్ర కమిటీలో చోటుకు ఒత్తిడి తేవడం గమనార్హం.



మట్టి గణపతే.. మహో గణపతి

మట్టి గణపతే మహో గణపతి అంటున్నారు.. రంగు రంగుల విగ్రహాలను వదిలి మట్టి గణపతుల వైపు భక్తజనం చూస్తున్నారు.. దీంతో మట్టి విగ్రహాలకు డిమాండ్ పెరిగింది.. పందిళ్లలోకి ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ భారీ విగ్రహాలను వినియోగిస్తుండగా.. ఇళ్లల్లో పూజ చేసుకునే భక్తులు మాత్రం మట్టి విగ్రహాలకే జై కొడుతున్నారు.. బుధవారం వినాయక చవితి సందర్భంగా మార్కెట్‌లో ఎక్కడ చూసినా బుల్లి బుల్లి మట్టి విగ్రహాలే దర్శనమిస్తున్నాయి..



నిడదవోలులో స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న మంత్రి దుర్గేష్

స్మార్ట్ రేషన్ కార్డులతో అక్రమాలకు చెక్

మంత్రి దుర్గేష్

నిడదవోలు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : రేషన్ సరుకుల పంపిణీలో అక్రమాలకు చెక్ పెడుతూ.. రేషన్ వ్యవస్థను ప్రక్షాళన చేసేలా లబ్ధిదారులకు స్మార్టు రేషన్ కార్డుల పంపిణీకి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాలులో సోమవారం జిల్లాస్థాయిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏటీఎం, ఆధార్ కార్డు తర హాలో స్మార్టు రేషన్ కార్డును అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిందన్నారు. దీనిలో క్యూఆర్ కోడ్ పొందుపర్చామన్నారు. కార్డుపై ముద్రించిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే కుటుంబీకుల వివరాలు, ఈకేవైసీ, రేషన్ సరుకులు, డిపో వివరాలు తెలుస్తాయన్నారు.జేసీ ఎస్.చినరాముడు మాట్లాడుతూ కొత్త టెక్నాలజీతో రూపొందించిన స్మార్టు రేషన్ కార్డులు లబ్ధిదారుడి ఫొటోతో రూపొందించామన్నారు. కార్యక్రమంలో కొవ్వూరు ఆర్డీవో రాణీ సుస్మిత, జిల్లా పౌరసరఫరాల అధికారి వి.పార్వతి, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ ఎ.దుర్గేష్, మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, తహశీల్దార్ నాగరాజు నాయక్ పాల్గొన్నారు.

ఎరువులు అక్రమంగా నిల్వచేస్తే కఠిన చర్యలు

కలెక్టర్ ప్రశాంతి హెచ్చరిక

కోరుకొండ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ మండలం గాడాల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (ప్యాక్ సొసైటీ) కార్యాలయాన్ని కలెక్టర్ పి.ప్రశాంతి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల సరఫరాలో పారదర్శకత పాటించాలని ఆదేశించారు. తనిఖీ సమయంలో ఎరువుల పంపిణీ జాబితాను పరిశీలించిన కలెక్టర్ రెండు బస్తాలు ఇచ్చే చోట ఒక రైతుకి ఐదు బస్తాలు ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. కొంత మంది రైతులు అదనంగా కోరుతున్నారని చెప్పగా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎరువుల కేటాయింపు పట్టాదారు పాసు పుస్తకం ఆధారంగా విస్తీర్ణం అనుసరించి జరగాలన్నారు. ఎక్కువ మోతాదులో తీసుకున్న రైతులను గ్రామ రెవెన్యూ అధికారుల ద్వారా పిలిపించండి అని ఆదేశించారు. సక్రమంగా పనులు చేయలేకపోతే చర్యలు తప్పవని సిబ్బందికి స్పష్టం చేశారు. అనంతరం



ఒక రైతుకు అధికంగా ఎరువులు ఇవ్వడంపై అధికారిని హెచ్చరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

కోరుకొండ గ్రామంలోని గ్రోమోర్ స్టోర్, గొడౌన్, శ్రీ పద్మజ ఫెర్టిలైజర్ జనరల్ స్టోర్స్‌ను పరిశీలించారు. సీతానగరం మండలం వెదుళ్లపల్లి ప్యాక్ సొసైటీ రికార్డులు, స్టాక్ రిజిస్టర్లు పరిశీలించి సరఫరా, వినియోగం వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎరువులు, యూరియా ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం మాత్రమే పంపిణీ జరగాలన్నారు. ఒక్కో రైతుకు కేటాయించిన పరిమితిని మించకూడదన్నారు. ఎరువుల సరఫరా, వినియోగం పై రికార్డులు తనిఖీ చేసి తహశీల్దార్ సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అక్రమ రవాణా, నిల్వలపై ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయన్నారు. విధుల్లో నిర్లక్ష్యం, స్టాక్ వివరాలు సరిగా నమోదు చేయని సిబ్బందికి షోకాజ్ నోటీ సులు జారీ చేసి, నిర్దిష్ట గడువులోగా వివరణ కోరాలని అధికారులను ఆదేశించారు. ఆమె వెంట జిల్లా సహకార అధికారి ఎం.వెంకట రమణ, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు తదితరులు ఉన్నారు.

ఎరువుల డీలర్లతో కలెక్టర్ సమావేశం..

రాజమహేంద్రవరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) : యూరియా, కాంప్లెక్స్ ఎరువుల సరఫరాలో దుర్వినియోగం లేకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నాం. అవసరానికి మించి ఎవరూ నిల్వ చేసి ఉపేక్షించేది లేదు.రిటైల్ డీలర్లు మార్గదర్శకాలు పాటించాలని కలెక్టర్ పి. ప్రశాంతి హెచ్చరించారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లాలోని ఎరువుల డీలర్లతో సమావేశం నిర్వహించారు.రాబోయే రబీ సీజన్‌కు అవసరమైన యూరియా, కాంప్లెక్స్ ఎరువులను ప్రభుత్వం సరఫరా చేసిందన్నారు. డీలర్లు అధిక మొత్తంలో కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయన్నారు.యూరియా ఒక బస్తాకు ప్రభు త్వం రూ.266గా ధర నిర్ణయించి సబ్సిడీతో ఇస్తుందని.. కానీ వాస్తవ ధర రూ.2300గా ఉందన్నారు. అవసరానికి మించి ఎరువులు కొనుగోలు చేసినా, నిల్వ చేసినా,రైతులను ప్రభావితం చేసేలా బల వంతపు అమకాలు చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్ఎస్‌కే ద్వారా వివరాలు అందజేసిన రైతులకే అమ్మకాలు జరపాల న్నారు.



పీజీఆర్ఎస్‌లో అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో సీతారామమూర్తి

పీజీఆర్ఎస్‌లో 181 అర్జీలు స్వీకరణ

రాజమహేంద్రవరం/రూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి):ప్రజా సమస్యలు వేగంగా పరిష్కరించాలని జేసీ ఎస్.చినరాముడు సూచించారు. బొమ్మూరు కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 181 అర్జీలు స్వీకరించినట్టు తెలిపారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో మాత్రమే కాకుండా క్షేత్రస్థాయిలో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అర్జీదారులు మండల , పంచాయతీ కార్యాలయాల్లో అధికారులకు అర్జీలు అందజేయవచ్చన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ నరసింహ కిశోర్ మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. 28 అర్జీలను స్వీకరించిన ఎస్పీ.. చట్ట పరిధిలో వాటి పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



కలెక్టరేట్ ఎదుట విద్యార్థుల ధర్నా.. పోలీసులతో వాగ్వాదం

కలెక్టరేట్ వద్ద ఎస్ఎఫ్ఐ ధర్నా



రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన విద్యార్థుల కలెక్టరేట్ ముట్టడి స్వల్ప ఉద్రిక్తతలకు దారితీసింది. కలెక్టరేట్ ప్రధాన గేటు ఎదురుగా ధర్నా చేసేందుకు ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. గేటుకు ఒక వైపున ధర్నా చేసుకోవాలని సూచించారు. కానీ ఎస్ఎఫ్ఐ నాయకులు ససేమిరా అంటూ గేటు ఎదుట బైఠాయించేందుకు ప్రయత్నించడంతో పోలీసులకు, ఎస్ఎఫ్ఐ నాయకులకు మధ్య వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది. దీంతో కొద్దిసేపు అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న డీఆర్వో ఆందోళన చేస్తున్న వారి వద్దకు వచ్చి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు తమ సమస్యలు పరిష్కరించాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ్మోహన్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.భాస్కర్, ఎన్.రాజా, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు, రాజమహేంద్రవరం నగర నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర యోగా పోటీలకు విద్యార్థినుల ఎంపిక


పోటీలకు ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నిడదవోలు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నిడదవోలులోని జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు రాష్ట్ర స్థాయి జూనియర్, సబ్ జూనియర్ యోగా పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 23న నల్లజర్లలో జరిగిన జిల్లా స్థాయి యోగాసనాల పోటీల్లో జూనియర్ విభాగంలో కె.జ్యోతి, డి.సత్యశ్రీ, కె.అనూష, సబ్ జూని యర్ విభాగంలో టి.దీపిక, ఎన్.అలేఖ్యశ్రీ, షేక్ రిజ్వానాలు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం అరుణ రాజశ్రీ తెలిపారు. సెప్టెంబరు 6,7 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా ద్వారకా తిరుమలలో జరగబోయే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను వ్యాయామ ఉపాధ్యాయులు సుందర్ జేమ్స్, కృష్ణకుమారి, శాంతి అభినందించారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు హర్ష



చాగల్లు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊనగట్ల జడ్పీ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి మెరిపో హర్ష రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యాడు. నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం జడ్పీ హైస్కూల్‌లో జరిగిన బాలుర సబ్ జూనియర్స్ విభాగంలో పాల్గొని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 29 నుంచి 31 వరకు ప్రకాశం జిల్లా చేవూరులో జరిగే పోటీల్లో హర్ష పాల్గొంటాడు. ఈ సందర్భంగా విద్యార్థితోపాటు వ్యాయామ ఉపాధ్యాయుడు కొయ్య గంగాధరరావును ప్రధానోపాధ్యాయుడు ఎన్వీ రమణయ్య, సొసైటీ అధ్యక్షుడు బి.శివనాగేంద్ర, పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నందిగం శ్రీనివాసరావు, ఎస్ఎంసీ చైర్మన్ శివ తదితరులు అభినందనలు తెలియజేశారు.

ఇద్దరు అంతర్ జిల్లాల దొంగలు అరెస్ట్


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ తిలక్

నిడదవోలు,ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): బ్యాంక్ ఏటీఎంలో నగదు చోరీ చేసేందుకు ప్రయత్నించిన అంతర్ జిల్లాల దొంగలను అరెస్టు చేయడం ద్వారా ఏడు కేసులు ఛేదించినట్టు సీఐ పీవీజీ తిలక్ తెలిపారు. సోమవారం నిడదవోలు పోలీస్ సర్కిల్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 14న నిడదవోలు మండలం తాడిమళ్ల గ్రామంలో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎంలో నగదు చోరీకి ప్రయత్నం జరిగిందన్నారు. నిడదవోలుకు చెందిన కోలా అభిషేక్, కోనసీమ జిల్లాకు చెందిన గుద్దటి రాజు ఈ చోరీకి ప్రయత్నించారని, వారిని అరెస్ట్ చేయడం ద్వారా పెందుర్తిలో రెండు, పాడేరులో ఒకటి, వి.మాడుగులలో ఒకటి, మండపేట రూరల్‌లో ఒకటి, రాజానాగరంలో ఒకటి, సమిశ్రగూడెంలో ఒకటి, మొత్తం ఏడు నేరాలు ఈ ఇద్దరు కలిసి చేసినట్టు తమ దర్యాప్తులో వెల్లడయ్యిందన్నారు. ఈ నిందితులపై సుమారు 30 పాత కేసులు ఉన్నాయని తెలిపారు. చిన్నతనం నుంచి చెడు వ్యసనాలకు లోనై దొంగతనాలు చేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో ఎస్ఐలు బాలాజీ సుందరరావు, జగన్ మోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు


హుండీ లెక్కింపు నిర్వహిస్తున్న దృశ్యం

పెరవలి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): అన్నవరప్పాడులో వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు సోమవారం నిర్వహించారు. 60 రోజులుకు ప్రధాన హుండీ ద్వారా రూ.5,61,939, అన్నదానం హుండీ ద్వారా రూ.12,628 ఆదాయం సమకూరినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.రాధాకృష్ణ తెలిపారు. దేవదాయ శాఖ తనిఖీదారు జి.సత్య వర ప్రసాద్ పర్యవేక్షణలో గ్రామస్థులు, స్వామి సేవకులు హుండీ లెక్కింపులో పాల్గొన్నారు.

16కార్లు స్వాధీనం.. 13 మంది అరెస్ట్


పోలీసులు స్వాధీనం చేసుకున్న కార్లు

నల్లజర్ల, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నల్లజర్ల బైపాస్ పక్కనే కోడిపందాలు నిర్వహిస్తున్న బృందంపై ఆదివారం రాత్రి పోలీసులు దాడి చేశారు. కోడిపందాలు నిర్వహిస్తున్నట్టు అందిన సమాచారంతో సీఐ బాలచౌరి సిబ్బందితో కలిసి దాడి చేసి 13మంది పందెం రాయుళ్లను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.35 వేల నగదు, 3కోళ్లను, 16 కార్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు దాడి చేస్తున్నారనే సమాచారం పందెం రాయుళ్లకు చేరడంతో అనేక మంది పారిపోయారు. కార్లలో వచ్చిన వారు తప్పించుకునే మార్గం లేకపోవడంతో పోలీసులకు చిక్కారు.

కొవ్వూరులో ప్రత్యేక పారిశుధ్య పనులు


కొవ్వూరులో పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులు

కొవ్వూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పురపాలక సంఘంలోని 23 వార్డులలో ప్రత్యే పారిశుధ్య పనులు చేపట్టినట్టు కమిషనర్ జి.సందీప్ తెలిపారు. సోమవారం పట్టణంలోని 3,4 వార్డుల్లో పారిశుధ్య పనులు నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి పారిశుధ్య కార్మికులు గ్యాంగ్ వర్కు చేపట్టారు. వార్డుల్లోని డ్రైనేజీల్లో పూడికలు తీయించడం, పిచ్చిమొక్కలు తొలగించడం,బ్లీచింగ్ చల్లించడం, దోమల నివారణకు మందులు స్ప్రే చేయించడం జరిగిందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా తయారయ్యిందన్నారు. ఈ సీజన్‌లో అంటువ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ చల్లాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. వర్షానికి రహదారులు ముంపునకు గురికాకుండా రోడ్డు డ్రైనేజీల్లో పూడికలు తీయిస్తున్నామన్నారు. అలాగే వర్షాకాలంలో పట్టణంలోని మురికి, లోతట్టు ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా పారిశుధ్య పనులు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో శానిటరి సెక్రటరీలు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగుభాష విశిష్టతను చాటిచెప్పాలి

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : గొప్ప సాంస్కృతిక వారసత్వం కలిగిన తెలుగుభాష విశిష్టతను ప్రతి స్త్రీ చాటి చెప్పాలని ఎస్‌కేఆర్ డీఎడ్ కళాశాల తెలుగు విభాగాధిపతి పి.విశాలాక్షి అన్నారు. తెలుగు సారస్వత పరిషత్, తెలుగు కళా గౌతమి నిర్వహిస్తున్న తెలుగు మాట పండుగ రాజమహేంద్రి కళాశాలలో సోమవారం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన విశాలాక్షి మాట్లాడుతూ తల్లిదండ్రులు మాతృభాషకు విలువ ఇవ్వాలని అన్నారు. ఇతర ప్రాంతాల వాళ్ల తమ భాషల పట్ల చూపుతున్న మమకారాన్ని మనం కూడా పెంపొందించుకోవాలని సూచించారు. రాజమహేంద్రి కళాశాల ప్రిన్సిపాల్ సౌందర్య స్వరూప్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

ఆచార వ్యవహారాలకు పెట్టింది పేరు...

కాగా, పుష్కరఘాట్ వద్ద జరిగిన తెలుగు పేరంటం కార్యక్రమానికి జక్కంపూడి విజయలక్ష్మి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. సంప్రదాయానికి, ఆచార వ్యవహారాలకు తెలుగు భాష పెట్టింది పేరని, భాషను నిలబెట్టినపుడే ఇవన్నీ నిలబడతాయని అన్నారు. ఈ సందర్భంగా గోదావరి మాతకు తొలి పేరంటాన్ని విద్యార్థినులతో ఇప్పించారు. కాలభైరవ సంస్థాన పీఠం అధ్యక్షుడు శివస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీదేవి, విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

నేడు వివేకానంద ఐటీఐలో జాబ్‌మేళా

ధవళేశ్వరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ పరిధిలోని ధవళేశ్వరం గ్రామంలో ఉన్న వివేకానంద ఐటీఐ ప్రాంగణంలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి కె.హరీష్ చంద్రప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తగిన అర్హత కలిగిన నిరుద్యోగ యువత నైపుణ్యం పోర్టల్‌లో తమ వివరాలు, అర్హత నమోదు చేసుకోవాలని తెలిపారు. రిజిస్టర్ చేసుకున్న అభ్యర్థులు ఆధార్‌కార్డు, అర్హత సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో మంగళవారం ఉదయం 10గంటలకు ధవళేశ్వరం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల సమీపంలోని వివేకానంద ఐటీఐ ప్రాంగణానికి రావాలని కోరారు.

చిట్టి చేతులు- మట్టి గణపతులు..

బిక్కవోలు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కొంకుదురు ఉన్నత పాఠశాలలో పీడీ డి.యువరాజా రెడ్డి ఆధ్వర్యంలో చిట్టి చేతులు-మట్టి గణపతులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాలలో ఆరు నుంచి పది వరకూ చదివే విద్యార్థులు ఆదివారం బంక మట్టితో పలు గణపతుల విగ్రహాలను తయారు చేసి సోమవారం పాఠశాలలో ప్రదర్శించారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు
- స్మార్ట్ రేషన్ కార్డుతో అక్రమాలకు తావుండదు: ఆర్డీవో
- పలుచోట్ల లబ్ధిదారులకు పంపిణీ


తాళ్లపూడిలో స్మార్ట్ రేషన్‌కార్డులను లబ్ధిదారులకు అందిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, ఆర్డీవో సుస్మిత

కొవ్వూరు/తాళ్లపూడి/చాగల్లు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం కొవ్వూరులోని 15వ వార్డు బ్రిడ్జిపేట వాంబేకాలనీ, కొవ్వూరు మండలం దొమ్మేరు, మండల కేంద్రం తాళ్లపూడి, చాగల్లు మండలం చాగల్లు, ఊనగట్ల, నందిగంపాడు గ్రామాల్లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతినెలా రేషన్ సరుకులను ఎటువంటి అవకతవకలు లేకుండా పారదర్శకంగా పంపిణీ చేయాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ప్రజల పట్టాదారు పాస్ బుక్, పంట పొలాల సరిహద్దు రాళ్లపై వైసీపీ రంగులు, ఫొటోలు వేసి ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశారన్నారు. గత ఐదేళ్లలో రూ.10 లక్షల కోట్లు అప్పులు చేశారు. దానిలో రూ.2 లక్షల కోట్లు మాత్రమే బటన్ నొక్కారన్నారు.కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందన్నారు. తాళ్లపూడిలో సర్పంచ్ నక్కా వెంకట అనురాధ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఆర్డీవో రాణీసుస్మిత, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా విచ్చేసి స్మార్ట్‌రేషన్ కార్డులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మాదిరిగా సీఎం ఫొటోలతో కాకుండా రాష్ట్ర ప్రభుత్వ రాజముద్రతోనే ప్రభుత్వం జారీ చేసిన పత్రాలు ఉంటాయని అన్నారు. త్వరలోనే రీ సర్వే చేసిన పొలాలకు పాసుపుస్తకాలు అందజేస్తామన్నారు. ఆర్డీవో మాట్లాడుతూ క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రేషన్‌కార్డుతో అక్రమాలకు తావుండదని, రేషన్ పంపిణీపై ఫిర్యాదులు కూడా ఈ కార్డు ద్వారా చేయవచ్చని అన్నారు. తహశీల్దార్ లక్ష్మీ లావణ్య మాట్లాడుతూ మండలంలో 34 రేషన్ షాపులు ఉన్నాయని, మొత్తం రేషన్‌కార్డులు 16810 ఉండగా 16667కార్డులను పంపిణీకి సిద్ధం చేశామన్నారు.కార్యక్రమాల్లో దాయన రామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, కౌన్సిలర్లు శ్రీనివాస రవీంద్ర, బత్తి నాగరాజు, టీడీపీ మండలాధ్యక్షుడు వట్టికూటి వెంకటేశ్వరరావు, బోడపాటి ముత్యాలరావు, టి.మోహనరావు, టీడీపీ తాళ్లపూడి మండలాధ్యక్షుడు నామన పరమేశ్వరరావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, ఉప సర్పంచ్ అప్పన జగదీష్, ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి, గంటా శివరామకృష్ణ, ఇండుగుల రామకృష్ణ పాల్గొన్నారు.చాగల్లులో ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్ చౌదరి, ఆళ్ల హరిబాబు,కేతా సాహెబ్, కరుటూరి సతీష్, తహశీల్దార్ ఎం.మెరికమ్మ పాల్గొన్నారు.

నల్లజర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తహశీల్దార్ నాయుడు, సివిల్ సప్లై డీటీ టి.సత్యనారాయణ ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ జరిగింది. దీనికి ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు విచ్చేసి లబ్ధిదారులకు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేస్తోందని, ప్రతిఒక్కరు ఉపయోగించుకోవాలని చెప్పారు.టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, కూచిపూడి ఉదయభాస్కర్, కూసంపూడి బుజ్జి, బీజేపీ మండలాధ్యక్షుడు చెల్లు సత్యనారాయణ, జనసేన మండలాధ్యక్షుడు చోడసాని బాపిరాజు, రుద్ర శ్రీను, బీజం దుర్గారావు రావూరి రమణ

దేవరపల్లి: దేవరపల్లి సొసైటీ వద్ద రేషన్ స్మార్ట్‌కార్డులను సొసైటీ చైర్మన్ ఉప్పులూరి రామారావు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో కల్లూరి శ్రీనివాస్‌శర్మ, వీఆర్వో పండు, రేషన్ డీలర్స్ పసుపులేటి రాధాకృష్ణ, రంజిత్‌కుమార్, వీరబాబు పాల్గొన్నారు.


నల్లజర్లలో స్మార్ట్‌కార్డ్‌లు అందజేసిన ఏఎంసీ చైర్మన్ బ్రహ్మరాజు


దేవరపల్లిలో స్మార్ట్‌కార్డ్ అందజేస్తున్న సొసైటీ చైర్మన్ రామారావు

డివిజినల్ పీజీఆర్ఎస్‌కు 12 ఫిర్యాదులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న తహశీల్దార్ అచ్యుతకుమారి

కొవ్వూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో స్వీకరించిన ఫిర్యాదులను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని ఆర్డీవో కార్యాలయ కేవీఆర్‌సీ తహశీల్దార్ పి.అచ్యుతకుమారి తెలిపారు. సోమవారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో డివిజినల్ స్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి 12 ఫిర్యాదులు స్వీకరించారు. అచ్యుతకుమారి మాట్లాడుతూ వారంలో రెండు సార్లు అధికారులతో సమావేశం నిర్వహించి పీజీఆర్ఎస్ కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిర్లక్ష్యానికి తావులేకుండా జవాబుదారి తనంతో పనిచేయాలని అధికారులకు సూచించారు.కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు


ఊనగట్ల ఎరువుల దుకాణంలో తనిఖీలకు వచ్చిన అధికారులు

చాగల్లు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండంలోని ఎరువుల దుకాణాలను విజిలెన్స్ బృందం వారు తనిఖీలు నిర్వహించారు. ఊనగట్ల సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే షాపు, నందిగంపాడు సాయికిట్టు ట్రేడర్స్ షాపులను విజిలెన్సు బృందం ఎస్వీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో తనిఖీ చేసారు. రైతులకు సకాలంలో ఎరువులు సక్రమంగా అందించడం, అక్రమాలు జరక్కుండా చూడం కోసం ఈ తనిఖీలు జరిగినట్లు తెలిపారు. స్టాక్ బోర్డు సక్రమంగా లేనందున సొసైటీ ఆధ్వర్యంలో నడిచే షాపునకు స్టాప్ సేల్స్ ఇవ్వడం జరిగిందని తహసీల్దార్ ఎం మెరికమ్మ తెలిపారు. దీంతో షాపులో ఎరువుల అమ్మకాలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. కొవ్వూరు ఏడీఏ సిహెచ్ శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారులు కే వేణుగోపాల కృష్ణ, రాజారావు, సోమశేఖరం తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి ఆటో బోల్తా

ఐదుగురికి తీవ్ర గాయాలు

నల్లజర్ల, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఆటో అదుపు తప్పి బోల్తా పడడంతో పలువురు గాయపడ్డారు. సోమవారం పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం ముదునూరు గ్రామం నుంచి 11మంది యరంపేటలో జరిగే శుభకార్యంలో పాల్గొనేందుకు ఆటోలో బయలుదేరారు. నల్లజర్లలోని పోలవరం కుడి కాల్వగట్టు వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గంగాధర్, వెంకయమ్మ, పెనుమాటి జానకి, అఖిల్, సూర్యకాంతంలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను నల్లజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు

పీజీఆర్ఎస్‌లో కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్


పీజీఆర్ఎస్‌లో అడిషనల్ కమిషనర్‌కు అర్జీ అందజేస్తున్న బొగ్గారపు రస్మిత



రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) ద్వారా వచ్చే అర్జీలకు సత్వర పరిష్కారం చూపించాలని నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ పి.రామలింగేశ్వర్ అన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఆయన పలువురు అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా రామలింగేశ్వర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాసమస్యల పరిష్కార వేదికకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నందున సంబంధిత విభాగాల అధికారులు సమస్యల పరిష్కారంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. వివిధ సమస్యలపై 23 అర్జీలు వచ్చాయని అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా నగరానికి చెందిన బొగ్గారపు రస్మిత దివ్యాంగురాలు. ఆమెకు కేంద్ర ప్రభుత్వ పింఛను ద్వారా నెలకు రూ.15,000 పింఛను వచ్చేది. అయితే రాష్ట్ర ప్రభుత్వ ఇటీవల చేపట్టిన దివ్యాంగ పింఛన్ల సర్వేలో భాగంగా రస్మిత పింఛన్‌ను రూ.6,000కు తగ్గించారు.పూర్తిగా దివ్యాంగురాలనైన తన పింఛన్‌ను రూ.15,000 నుంచి రూ.6,000కు తగ్గించారని, ఇంట్లో గడవడం ఇబ్బంది ఉందని, పాత పింఛనను పునరుద్ధరించి తనను ఆదుకోవాలని సోమవారం ఆమె కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో అడిషనల్ కమిషనర్‌కు అర్జీ అందజేశారు.

నిలకడగా గోదావరి ప్రవాహం



ధవళేశ్వరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం నిలకడగా కొనసాగుతుంది. సోమవారం సాయంత్రం కాటన్ బ్యారేజ్ నుంచి 4,98,313క్యూసెక్కుల మిగులు ప్రవాహాన్ని దిగువకు విడుదల చేస్తుండగా ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 10 అడుగులుగా నమోదయింది. వ్యవసాయ అవసరాల కోసం తూర్పుడెల్టాకు 4900క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2500క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 7000 క్యూసెక్కులు చొప్పున సాగునీటిని విడుదల చేస్తున్నారు. ఎగువున అన్ని ప్రాంతాల్లో నీటి మట్టం తగ్గుముఖం పడుతుంది. భద్రాచల వద్ద గోదావరినీటి మట్టం సోమవారం సాయంత్రానికి 29.40 అడుగులుగా నమోదయింది.

ఏపీయూడబ్ల్యూజే గోపాలపురం నూతన కార్యవర్గం

నల్లజర్ల, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఏపీయూడబ్ల్యూజే గోపాలపురం నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సోమవారం స్థానిక ఏఎంసీ కార్యాలయంలో నియోజకవర్గ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సభ్యుల సర్వసభ్య సమావేశం జరిగింది.ఈ సందర్భంగా నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా అనిల్ (ఆంధ్రజ్యోతి), ఉపాధ్యక్షుడి మూర్తి(టీవీ9), కార్యదర్శిగా మురళీ(మహా న్యూస్), జాయింట్ సెక్రటరీ గా చెల్లు మోజేష్(ఆంధ్రజ్యోతి), కోశాధికారిగా రమేష్ (స్వతంత్ర టీవీ), ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా అచ్యుతరావు(ఆంధ్రప్రభ),బాబురావు(ప్రజాశక్తి)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. త్వరలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయనున్నట్టు అనిల్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రసాద్(టీవీ 5), ప్రసన్నకుమార్ (ఏబీఎన్), నాగబాబు, నాగేంద్ర, మహేశ్, వెంకటేశ్, సురేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

'చలో విజయవాడ'ను జయప్రదం చేయండి


గోపాలపురంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏపీసీపీఎస్‌ఈ సభ్యులు

గోపాలపురం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీసీపీఎస్‌ఈ జిల్లా అధ్యక్షుడు జోడాల వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. విజయవాడలో సెప్టెంబర్ 1న చేపట్టే మహాధర్నాకు సంబంధించి పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విజయవాడలో ధర్నాచౌకలో జరిగే మహాధర్నాకు ఉద్యోగ, ఉపాధ్యాయు లంతా అధిక సంఖ్యలో హాజరవ్వాలన్నారు. సీపీఎస్, జీపీఎస్ తమకు వద్దు అని ఓపీఎస్ మాత్రమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మిరపల నాగేశ్వరరావు,సనపల రాజశేఖర్, జాన్ బాబు, ఎం.మంగిరాజు, యుగంధర్, శ్యామ్‌కుమార్, వెంకటరమణ, లక్ష్మీతులసి, బాలాజీ, శ్రీనివాస్,రత్నం తదితరులు పాల్గొన్నారు.

పొదుపు లెక్కలు సమర్థవంతంగా నిర్వహించాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న సెర్ప్ ఏసీఈవో శ్రీరాములునాయుడు

చాగల్లు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మహిళా సమాఖ్య సభ్యులకు మన డబ్బులు మన లెక్కలు అనే అంశంపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సెర్ప్ అడిషల్ సీఈవో ఆర్.శ్రీరాములు నాయుడు మాట్లాడుతూ స్వయం సహాయక బృంద సభ్యులు పొదుపు లెక్కలు సక్రమంగా, సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. పొదుపు, అప్పులు, ఆర్థిక లావాదేవీల గురించి వివరించి ఏవిధంగా నిర్వహించాలో అవగాహన కల్పించారు.కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ మూర్తి, జిల్లా మహిళా సమాఖ్య సెక్రటరీ డొక్కు లక్ష్మీ పార్వతీ, ఏపీడీ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ రథాలతో వినియోగదారుడికి లబ్ధి

ఎమ్మెల్యే గోరంట్ల


హుకుంపేటలో స్వచ్ఛ రథాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మొబైల్ వాహనాల(స్వచ్ఛ రథాలు) వల్ల ఇళ్లలో పనికిరాని వస్తువులు సేకరించి, వారికి అవసరమైన నిత్యావసరాలు అందజేయడం ద్వారా వినియోగదారుడికి లాభం చేకూరడంతో పాటు పరిసరాల పరిశుభ్రత పెరుగుతుందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు.ఇళ్లల్లో వృథాగా పడి ఉన్న ప్లాస్టిక్ వస్తువులు, పుస్తకాలు ఉపయోగపడని ఇతర వస్తువులను సేకరించి వాటి ధరకు సమానమైన నిత్యావసర వస్తువులను అందజేసే రెండు స్వచ్ఛ రథాలను సోమవారం హుకుంపేట పంచాయతీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే గోరంట్ల ప్రారంభించారు. అలాగే నియోజకవర్గం పరిధిలోని 16వ వార్డు తూర్పు రైల్వేస్టేషన్ రోడ్డు ప్రాంతంలో రూ.22.50 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించే సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే గోరంట్ల శంకుస్థాపనకు చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లు, డ్రయిన్లు ఆక్రమిస్తూ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, వాటన్నింటినీ తొలగించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వం చేసిన నిర్వాకం కారణంగా రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సమర్థవంతంగా సంక్షేమం, అభివృద్ధి వైపు తీసుకెళుతున్నారన్నారు. కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్మన్ మార్ని వాసుదేవరావు, డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్, ఎంపీడీవో ఆర్మ్‌స్ట్రాంగ్,తహసీల్దార్ శ్రీనివాసరావు, చలుమూరి సత్యనారాయణ, ఎంఎంఎల్ రాజు, సింగవరపు సత్యనారాయణ, అడపా వరప్రసాద్, సుబ్బాయమ్మ, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురంలో యూరియా కోసం పడిగాపులు


సొసైటీ వద్ద యూరియా కోసం పడిగాపులు పడుతున్న రైతులు

గోపాలపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): యూరియా కొరతతో రైతులు ఆందోళన చెందుతున్నారు. యూరియా కొరత ఏర్పడిందన్న వార్తతో రైతులు రెండు రోజులుగా అప్రమత్తమయ్యారు. సోమవారం ఉదయం 6గంటలకే గోపాలపురం సొసైటీ వద్ద అధిక సంఖ్యలో బారులుదీరారు. మండలానికి ఐదు టన్నుల యూరియానే దిగుమతి కావడంతో రైతులకు సొసైటీ సిబ్బంది సర్దిచెప్పి ఉన్న స్టాకును యూరియా కోసం వచ్చిన రైతులందరికి సర్దుబాటు చేశారు.